Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

మంగళవారం | 10-11- 2026 | సంపుటి: 17, సంచిక: 220, పేజీలు: 12, వెల: 3/-

హైదరాబాద్‌లో మెగా క్లైమేట్ కాన్‌క్లేవ్!



- డిసెంబర్ 7 నుంచి ప్రపంచ పర్యావరణ దిగ్గజాల సందడి!
- ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ..
- అంతర్జాతీయ వాతావరణ నిపుణులకు ఆహ్వానం
- హరిత పెట్టుబడులు, నీటి భద్రతపై కీలక చర్చలు 2



రంగారెడ్డి కలెక్టర్‌కు

6 నెలల జైలుశిక్ష

- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు తీర్పు
- నిషేధిత జాబితా నుంచి ప్లాట్లను తొలగించనందుకు..
- అప్పీలుకు వీలుగా శిక్ష అమలు 4 వారాలు నిలిపివేత

హైదరాబాద్, నవంబరు 9 (ప్రజాకలం) :

నిషేధిత జాబితా భూములకు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఆరునెలల జైలుశిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అప్పీలుకు అవకాశం కల్పిస్తూ జైలుశిక్ష అమలును నాలుగువారాలపాటు నిలిపివేసింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ రెవెన్యూ గ్రామ పరిధిలోని మన్నె ముత్యాలమ్మ కుంట సర్వే నెంబర్ 536, 537, 657, 658లలో పిటిషనర్లు పీ శివలీల, పీ వెంకటేశ్వర్లుకు చెందిన ప్లాట్ నెంబర్లు 62, 59లను రిజిస్ట్రేషన్ యాక్ట్-1908 సెక్షన్ 22ఏ (నిషేధిత జాబితా) నుంచి తొలగించాలని పేర్కొంటూ జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం గతంలో తీర్పు ఇచ్చింది.

తరువాయి 2వ పేజీలో...

సంక్రాంతి తర్వాత ప్రజాబలంతో

సునామీ సృష్టిస్తాం

బియ్యం ధరలపై భయమొద్దు.. ఏడాదికి సరిపడా నిల్వలు

కేటీఆర్ గడ్డం పెంచుకుంటే రేవంత్‌రెడ్డి కాలేడు

2028 డిసెంబరు నాటికి కొడంగల్‌కు కృష్ణా జలాలు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం

కొడంగల్‌లో రైతు ఆత్మీయ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



రంగారెడ్డి నవంబరు 9 (ప్రజాకలం) :

'ఢిల్లీలో ఉన్న మోదీకైనా, ఫామ్‌హౌస్‌లో ఉన్న కేడీకైనా భయపడేది లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడ జరిగే అభివృద్ధికి ఎవరైనా తలవంచాల్సిందేనన్నారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదం ఉంటే ఢిల్లీని సైతం ఎదిరించి నిలబడతామని, ప్రధాని మోదీ అయినా, ప్రతిపక్ష నేత కేసీఆర్ అయినా అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గబోమని చెప్పారు. సంక్రాంతి తరువాత ప్రజాబలంతో సునామీ సృష్టిస్తామని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో మూడో రోజు పర్యటనలో భాగంగా సోమవారం కొడంగల్ నివాసం నుంచి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి.. దారిలో పోలెపల్లి ఎల్లమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుంచి లగచర్ల చేరుకుని ఇండస్ట్రియల్ కారిడార్‌లో నిర్మిస్తున్న ఎకో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వేలాది మందితో కలిసి హకీంపేట బహిరంగ సభ వరకు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన రైతు ఆత్మీయ సభలో మాట్లాడుతూ.. దేవుడు తనకు

తరువాయి 2వ పేజీలో...



వ్యవసాయ వర్సిటీ వీసీ జానయ్యకు

నోటీసులు

12న విచారణకు రావాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశం

లైంగికంగా వేధించారని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 10 (ప్రజాకలం) :

వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్యకు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. 12వ తేదీన మధ్యాహ్నం 12.30 గంటలకు హైదరాబాద్‌లోని మహిళా కమిషన్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. వ్యవసాయ వర్సిటీలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ముసిని తేజశ్రీ ఈ నెల ఏడో తేదీన మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తనను లైంగికంగా వేధించారని, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ పిటిషన్ సమర్పించగా.. ఈ మేరకు నోటీసు జారీ అయింది. ఈ విషయమై బాధితురాలు తేజశ్రీ.. ఇప్పటికే ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వీసీ జానయ్య వేధిస్తున్న తీరును వివరించారు. ఈ నెల 7వ తేదీన యూనివర్సిటీ బోధన, బోధనేతర ఉద్యోగ సంఘాల నేతలు, పీహెచ్‌డీ స్కాలర్స్, విద్యార్థు లు... బాధితురాలు తేజశ్రీతో కలిసి రాజేంద్రన గర్ వ్యవసాయ కళాశాల ఆవరణలో నిరసన చేపట్టారు.

తరువాయి 2వ పేజీలో...

జిల్లాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా




హైదరాబాద్, నవంబరు 9 (ప్రజాకలం) :

రాష్ట్రంలోని ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు వారి జిల్లాల్లోనే అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్




వైద్య శాఖలో 2,929 పోస్టులు భర్తీకి

త్వరలోనే నోటిఫికేషన్లు

ఇప్పటికే 996 పోస్టులకు ఆర్థిక శాఖ ఆమోదం

మిగిలిన వాటికి అంగీకారం లభించగానే ఉద్యోగ ప్రకటన



హైదరాబాద్, నవంబర్ 9 (ప్రజాకలం) :

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మరోమారు కొలువుల జాతరకు సిద్ధమైంది. త్వరలో మరిన్ని ఉద్యోగాల భర్తీకి సిద్ధమవుతోంది. ఈ మేరకు వైద్యశాఖలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 2,929 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో 996 పోస్టులకు ఆర్థిక శాఖ ఇప్పటికే అనుమతినివ్వగా, మిగిలిన 1,933 పోస్టులకు ఆమోదం లభించాల్సి ఉంది. త్వరలోనే ఉద్యోగ ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది. కాగా, ఆర్థిక శాఖ ఇప్పటికే అనుమతించిన 996 పోస్టుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 198, ఆయుష్ ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టులు 308, టెక్నీషియన్ పోస్టులు 290, బయోమెడికల్ ఇంజినీర్లు 14, ఫిజియోథెరపిస్టులు 46, రేడియోగ్రాఫర్లు 11, ల్యాబ్ టెక్నీషియన్లు 73, ఏఎన్ఎంలు 54 పోస్టులు ఉన్నాయి. వీటిని తెలంగాణ వైద్య విధాన పరిషత్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, వైద్య విద్య సంచాలకులు, ఆయుష్, ఎంఎన్‌జే, ఐపీఎం తదితర విభాగాల్లో భర్తీ చేయనున్నారు. ఆర్థికశాఖ అనుమతి రావాల్సి ఉన్న మరో 1,933 పోస్టుల్లో ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 134 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, డీఎంఈ పరిధిలో 288 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు 716 అసిస్టెంట్ ప్రొఫెసర్, 148 సివిల్ అసిస్టెంట్ సర్జన్, 194 స్టాఫ్ నర్సు, 96 ల్యాబ్ టెక్నీషియన్, 119 జూనియర్ అసిస్టెంట్, 238 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులున్నాయి.

ఖాళీల వారీగా నోటిఫికేషన్లు

ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే నియామక

తరువాయి 2వ పేజీలో...

వివాహ బంధానికి పవన్, అన్నా స్వస్తి

- మంచి స్నేహితులుగాకొనసాగుతాం
- విడాకులపై సంయుక్త ప్రకటన విడుదల

అమరావతి, నవంబరు 9 (ప్రజాకలం) :

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధిపతి, సినీ నటుడు పవన్ కల్యాణ్... ఆయన సతీమణి అన్నా లెజ్‌నెవా తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. దీనిపై సోమవారం రాత్రి ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'మా శ్రేయోభిలాషులు... సన్నిహితులకు'... అంటూ పవన్ కల్యాణ్ కొణిదెల, అన్నా కొణిదెల పేర్లతో ఈ ప్రకటన వెలువడింది. "మా జీవితంలో ముఖ్యమైన భాగాన్ని కలిసి గడిపాం.

తరువాయి 2వ పేజీలో...

సంక్రాంతి తర్వాత ప్రజాబలంతో సునామీ సృష్టిస్తాం

మొదటి పేజీ తరువాయి...

జడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి వరకు అన్ని అవకాశాలు ఇచ్చాడని, ఇక ప్రజలకు తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. తెలంగాణను నంబర్‌వన్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టేందుకు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నానని, సీఎం అయిన తరువాత ఒక్క రోజూ సెలవు తీసుకోలేదని చెప్పారు.

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం..

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, అయితే ఈ సమస్యను కలిసికట్టుగా ఎదుర్కొందామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సాధారణంగా కరువు వస్తే ఆహార ధాన్యాలు, తాగునీటి కొరత ఏర్పడుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం ప్రధానంగా నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని అన్నారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బియ్యానికి కొదవ లేదని, 12 నెలలకు సరిపడా బియ్యాన్ని ఖజానాలో దాచిపెట్టామని తెలిపారు. ఈ ఒక్క సీజన్‌లో వడ్లు పండించకపోయినా ఏడాదికి సరిపడా సన్న బియ్యం ప్రభుత్వం వద్ద ఉన్నాయన్నారు. ప్రజలు బియ్యం ధరలు పెరుగుతాయని భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సంక్రాంతి తర్వాత కొడంగల్ నుంచి ప్రజాబలం కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి కరువును ఎదుర్కొనే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెట్టాలనుకున్నానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆనాడు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. "ధనిక రాష్ట్రం, మూడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న తెలంగాణలో ఏడో తారీకు వచ్చినా ఉద్యోగస్తులకు జీతభత్యాలు ఇవ్వడం లేదు. ఎందుకని అడిగితే.. పదేళ్లలో కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు అధికారులు చెప్పారు. నెత్తిమీద అప్పు.. చేతిలో చిప్ప పెట్టి అయ్యగారు పోయి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఇప్పుడే గాడిలో పెడుతున్నాం. 5లక్షల మంది ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలు ఇస్తున్నాం. మిగతా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 5వ తేదీన ఇస్తున్నాం" అని సీఎం వివరించారు. నిజాం పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత ఎంతో మంది నాయకులు తెలంగాణ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించినా పాలమూరు వలసలు ఆగలేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడితే పాలమూరు రైతుల కష్టాలు తీరుతాయని, వలసలు ఆగుతాయని భావించి 2009 ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతిచ్చామని తెలిపారు. ఉద్యమం దెబ్బతినకూడదని విఠల్‌రావును పక్కనపెట్టి కేసీఆర్‌ను పార్లమెంటుకు పంపించామని చెప్పారు. తెలంగాణ సాధన కోసం కనిపించిన ప్రతి దేవుడినీ మొక్కుకున్నామని, రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పాలమూరు జిల్లాకు ప్రాధాన్యత ఇస్తారని ప్రజలు ఆశించారని అన్నారు. అయితే తనను ఆదరించిన పాలమూరు ప్రజల కష్టాలను కేసీఆర్ పట్టించుకోలేదని ఆరోపించారు.

పది జన్మలెత్తినా రేవంత్‌రెడ్డివి కాలేవ్

కేటీఆర్ తనను అనుకరించేందుకు ప్రయత్నిస్తున్నారని, గడ్డం పెంచుకున్నంత మాత్రాన నాయకత్వ లక్షణాలు రావని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. "కేటీఆర్.. నీకు గడ్డం రావడానికి 50 ఏళ్లు పట్టింది.. బుద్ధి రావడానికి ఎన్నేళ్లు పడుతుందో తెలియదు. మోకాళ్ల దాకా కాళ్లకు అడ్డం పడే విధంగా గడ్డం పెంచుకున్నా, పది జన్మలు ఎత్తినా.. ఎప్పటికీ నువ్వు రేవంత్ రెడ్డివి కాలేవు" అని సీఎం వ్యాఖ్యానించారు. కొడంగల్‌కు నీళ్లు వస్తే కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. "కొడంగల్ బాగుపడతుందని గోల చేస్తున్నారు. మీ అయ్య సొమ్ము లేదా మీ సొమ్ము ఏమన్నా గుంజుకున్నామా? లేకపోతే మీ బ్యాంకులో ఉన్న సొమ్ము అడిగామా? మా కష్టమే కదా ఇది? మా భూములే కదా? మా హకీంపేట, మా పోలేపల్లి, ఈర్లపల్లి, లగచర్ల ప్రజలు ఇచ్చినా మా భూములే కదా? మా భూముల్లో పరిశ్రమలు పెట్టుకుంటే మీకెందుకు బాధ?" అని ప్రశ్నించారు. కేటీఆర్ ఇక్కడ సాగునీటి ప్రాజెక్టులు ఆపే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు అడ్డుపడినా ఇక్కడ ప్రారంభించిన రూ.10 వేల కోట్ల పనులు పూర్తి చేస్తామని, 2028 డిసెంబరు నాటికి కృష్ణా జలాలు తీసుకొచ్చి కొడంగల్ భూముల్లో పచ్చని వంటలు వండించే బాధ్యత తనదని ప్రకటించారు. హైదరాబాద్ నుంచి కొడంగల్‌కు గంటలో చేరుకునేలా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, దానికి ఇరువైపులా పది వేల ఎకరాల్లో పారిశ్రామిక వాడలు నిర్మిస్తున్నామని, అందులో కొడంగల్‌లోనే 3వేల ఎకరాల్లో రూ.వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

మీడియా మిత్రుల ఇళ్లస్థలాల సమస్య తనకు తెలుసునని, దానిని పరిష్కరించే బాధ్యత తనదేనని సీఎం రేవంత్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కారణంగా ఇళ్ల పట్టాల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, అయినప్పటికీ ఏదో ఒక మార్గంలో వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబు, రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

పాదయాత్రగా బహిరంగ సభకు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం కొడంగల్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో పోలెపల్లికి చేరుకున్నారు. పోలెపల్లి శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం లగచర్ల భారీ బహిరంగ సభకు పాదయాత్రగా బయలుదేరారు. సీఎంతో పాటు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో కొడంగల్ అభివృద్ధికి మరింత ముందుకు సాగుతున్నామని అన్నారు. నియోజకవర్గంలో రూ.9,053 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు.

జిల్లాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు

మొదటి పేజీ తరువాయి...

ఇందుకు అనుగుణంగా ఈ హాస్పిటళ్లలో మౌలిక సదుపాయాలు, స్పెషలిస్ట్ వైద్య సేవలు, అవసరమైన వైద్య సిబ్బంది, డయాగ్నస్టిక్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రోగులు చిన్న చిన్న సమస్యలకు కూడా హైదరాబాద్‌కు, మెడికల్ కాలేజీ హాస్పిటళ్లకు వెళ్లే పరిస్థితి తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం, సెక్రటేరియట్‌లో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి మాట్లాడారు. డీఎస్‌హెచ్ పునర్వ్యవస్థీకరణపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా రూపొందించిన అధ్యయన నివేదికలోని ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు.

డీఎస్‌హెచ్ పరిధిలోని హాస్పిటళ్లలో ఇటీవలే 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను రిక్రూట్ చేశామని, అవసరమైన మేర నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టామని మంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకాల ఫలితాలు ప్రజలకు అందాలంటే ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఏ హాస్పిటల్‌లో ఏ స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి? ఇంకా ఏయే విభాగాల్లో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అవసరం ఉంది? ఏయే వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాల్సి ఉంది? అనే అంశాలపై హాస్పిటల్ వారీగా సమగ్ర సమీక్ష చేపట్టాలని ఆదేశించారు. స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నప్పటికీ అవసరమైన పరికరాలు, సిబ్బంది లేక వైద్య సేవలు అందించలేని పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.

30 పడకలు, 50 పడకలు, 100 పడకలు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన హాస్పిటళ్లకు వాటి స్థాయికి అనుగుణంగా వైద్య సేవల పరిధిని నిర్ణయించాలని మంత్రి సూచించారు. సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాల్సిన స్పెషాలిటీ విభాగాలు, వైద్య సేవలు, పడకలు, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, ఇతర సదుపాయాలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలోని సెకండరీ హెల్త్ కేర్ హాస్పిటళ్లను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. ప్రతి హాస్పిటల్‌లో అవసరమైన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, మందులు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రస్తుతం ఉన్న సిబ్బంది, మంజూరై పోస్టులు, ఐపీహెచ్‌ఎస్ ప్రమాణాల ప్రకారం అవసరమైన సిబ్బంది సంఖ్యను పోల్చి చూసి, లోటుపాట్లను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న పోస్టులను అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడంతో పాటు, అదనంగా అవసరమైన పోస్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సమీక్షించిన మంత్రి, రాష్ట్రస్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పరిపాలనా బాధ్యతలు ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాలోని హాస్పిటళ్ల పనితీరు, వైద్య సేవల నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.హాస్పిటళ్లలో రోగులకు ఎదురవుతున్న సమస్యలు, వైద్య సేవల్లో లోటుపాట్లు, సిబ్బంది అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రముఖ ఆంకాలజిస్ట్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేశ్ దత్ ఎక్కా, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్. చొంగ్తు, ఆర్థికశాఖ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ, ఆస్కి డైరెక్టర్ డాక్టర్ సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ వీసీ జానయ్యకు నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

వీసీని పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. తాజాగా ఇదే అంశంపై రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించి వీసీకి నోటీసులు జారీ చేసింది. కాగా, ఈ ఘటనపై సీఎం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కళాశాల నుంచి వర్సిటీ పరిపాలన భవనం వరకు టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పలువురు ఉద్యోగులు విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మాట వినని మహిళా అధికారులను బదిలీ చేయడం సర్వ సాధారణమైపోయిందని జగిత్యాల వ్యవసాయ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సునీత పేర్కొన్నారు. తేజశ్రీని వీసీ వేధించాడని తెలుసు కుని ఓ మహిళగా ఆమెకు అండగా నిలవాలనే ఇక్కడికి వచ్చాన న్నారు. దీనిపై సీఎం రేవంత్ స్పందించి విచారణ కమిటీ వేయాలని కోరారు. వీసీ ఫోన్‌లో వేధిస్తున్నాడని, చాంబర్‌కు పిలిచి ఇష్టానుసారంగా మాట్లాడాడని మూడు నెలల క్రితమే తేజశ్రీ చెప్పిందని మైక్రో బయాలజీ విభా గం హెడ్ త్రివేణి పేర్కొన్నారు. తమకు వీసీపై ఎలాంటి కోపం లేదని, ఒక మహిళకు జరిగిన అన్యాయంపై విచారణ జరగాలని కోరుకుంటు న్నామని నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ టెక్నికల్ కార్యదర్శి సులోచన పేర్కొన్నారు.

రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలుశిక్ష

మొదటి పేజీ తరువాయి...

60 రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే, 60 రోజులు పూర్తయినప్పటికీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోకపోవడంతో పిటిషనర్లు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదిస్తూ.. కలెక్టర్ కోర్టు ఉత్తర్వులు పాటించకపోవటమేగాక, నిషేధిత జాబితా నుంచి తమ ప్లాట్లను తొలగించాలన్న దరఖాస్తును తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. 18 ఏళ్ల కింద ల్యాండ్ రిఫామ్స్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును కలెక్టర్ తన ఉత్తర్వులను కారణంగా చూపుతున్నారని.. అయితే ఆ కేసు అప్పీల్ దశలో తిరస్కరణకు గురైన విషయాన్ని కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ల్యాండ్ రిఫామ్స్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఇప్పటికే కొన్ని ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించారని.. మిగతా వాటిని తొలగించకుండా కారణాలు చెప్పడాన్ని ఆక్షేపించింది. అదే లేఅవుట్‌లో పిటిషనర్ల ప్లాటు పక్కన ఉన్న మరో ప్లాటును అప్పటి జిల్లా కలెక్టర్ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ 2022లో ఉత్తర్వులు జారీచేసిన విషయాన్ని ప్రస్తుత కలెక్టర్ పట్టించుకోలేదని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా, ఉద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు ఆరునెలల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. కాగా ఈ తీర్పుపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు.

స్టే ఉత్తర్వులను పట్టించుకోనందుకు..

మరో కోర్టు ధిక్కరణ కేసులో రిజిస్ట్రేషన్లశాఖకు చెందిన ముగ్గురు అధికారులకు జైలుశిక్ష పడింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ పీ శ్రీను, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌లు వీ అశోక్, పీ మధుబాబులకు ఆరునెలల జైలుశిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ ఎన్ తుకారాంజీతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు జారీచేసింది. ఇదే కేసులో ఏడీఆర్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ సీహెచ్ దామోదర్‌రావుకు సైతం జైలుశిక్ష పడింది.

హైదరాబాద్ బాచుపల్లి గ్రామపరిధిలోని సర్వే నెంబర్ 140లోని 10 ఎకరాల భూమి విషయంలో ద్విసభ్య ధర్మాసనం స్టే ఇచ్చినప్పటికీ ఆ స్టే ఉత్తర్వులను పట్టించుకోకుండా ఏడీఆర్ ఎస్టేట్స్ సమర్పించిన డాక్యుమెంట్లను సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారు. కంపెనీ ఎండీతోపాటు అధికారులకు హైకోర్టు డివిజన్ బెంచ్ జైలుశిక్ష విధించింది. శిక్ష అమలును 4 వారాలపాటు నిలిపివేసింది.

వివాహ బంధానికి పవన్, అన్నా స్వస్తి

మొదటి పేజీ తరువాయి...

ఇప్పుడు పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాం. మా వైవాహిక జీవితం ముగిసినప్పటికీ... మంచి స్నేహితులుగా, మా పిల్లలకు మంచి తల్లిదండ్రులుగా కొనసాగుతాం. మా పిల్లల ఆనందం, శ్రేయస్సు ఎప్పటికీ మా ఉమ్మడి ప్రాధాన్యాల్లో భాగంగా ఉంటుంది. మా వ్యక్తిగత జీవితంలో జరుగుతున్న మార్పు ఇది. దీనిని అర్థం చేసుకుంటారని, మా ప్రైవసీని గౌరవిస్తారని ఆశిస్తున్నాం. మా ప్రయాణంలో తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు" అని ఆ ప్రకటనలో తెలిపారు. పవన్ కల్యాణ్‌కు ఇది మూడో వివాహం. ఆయన సినీరంగ ప్రవేశం తర్వాత ఒక యువతిని పెళ్లాడారు. కొన్నేళ్లకు వారు విడిపోయారు.

వైద్య శాఖలో 2,929 పోస్టులు భర్తీకి

త్వరలోనే నోటిఫికేషన్లు

మొదటి పేజీ తరువాయి...

ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పోస్టులవారీగా ఖాళీలు, విభాగాల వారీగా అవసరాలను ఖరారు చేసి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నోటిఫికేషన్లు జారీ చేయనుంది. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామకాలు మాత్రం టీపీఎస్సీ ఆధ్వర్యంలో జరగనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వైద్య ఆరోగ్యశాఖలో 2,711 పోస్టుల భర్తీ ప్రక్రియను నిర్వహిస్తోంది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలోని ఎంపీహెచ్ఏ(ఫీమేల్) పోస్టుల భర్తీ దాదాపుగా పూర్తయ్యింది. త్వరలో తుది జాబితాను ప్రకటించనున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. మొత్తం 1931 ఎంపీహెచ్ఏ (ఫీమేల్) పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఫార్మాసిస్టు గ్రేడ్-2కు సంబంధించి 732 పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. సాంకేతిక కారణాలతో వీటి భర్తీలో జాప్యం చోటు చేసుకుంది. 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల నియామక ప్రక్రియ కాస్త ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ 48 పోస్టులకుగాను 4 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి, వెయిటేజ్ మార్కులను చెక్ చేయడానికి ఎక్కువ సమయం పడుతున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాతవైద్యశాఖలో13,401 పోస్టులను భర్తీ చేసింది.

హైదరాబాద్‌లో మెగా క్లైమేట్ కాన్‌క్లేవ్!

- డిసెంబర్ 7 నుంచి ప్రపంచ పర్యావరణ దిగ్గజాల సందడి!
- ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ..
- అంతర్జాతీయ వాతావరణ నిపుణులకు ఆహ్వానం
- హరిత పెట్టుబడులు, నీటి భద్రతపై కీలక చర్చలు



హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, హరిత పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో మెగా క్లైమేట్ కాన్‌క్లేవ్ నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పర్యావరణ నిపుణులు, ప్రముఖులను ఆహ్వానించనున్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ – గ్లోబల్ సమ్మిట్ 2026లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు.

ఎల్‌నినో ముప్పుపై ప్రత్యేక దృష్టి

రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను తెలంగాణ ముందుగానే అంచనా వేసుకుని సిద్ధంగా ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. దీర్ఘకాలిక కరువు, నీటి కొరత, వ్యవసాయ రంగంపై ప్రభావం, పెరిగే ఉష్ణోగ్రతలు వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పశుగ్రాసం లభ్యత, విద్యుత్ డిమాండ్, బలహీన వర్గాల రక్షణకు అవసరమైన చర్యలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వేసవి నెలల్లో కరువు నివారణ, సహాయక చర్యల కోసం ప్రతి నెలా సుమారు రూ.1,000 కోట్లు సమీకరిస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు శాస్త్రీయంగా, దీర్ఘకాలికంగా పనిచేసే ప్రణాళికలు అవసరమని స్పష్టం చేశారు.

పర్యావరణ దిగ్గజాలకు ఆహ్వానం

ఈ క్లైమేట్ కాన్‌క్లేవ్‌కు అంతర్జాతీయ గుర్తింపు ఉన్న పర్యావరణవేత్తలు, నిపుణులను ఆహ్వానించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రాజేంద్ర సింగ్, సునీతా నారాయణ్, సద్గురు, నార్వే మాజీ పర్యావరణ మంత్రి ఎరిక్ సోల్హీమ్ పేర్లను ప్రతిపాదిత ఆహ్వానితుల జాబితాలో చేర్చారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే బాలీవుడ్ నటి దియా మీర్జాను కూడా ముఖ్యంగా ప్రారంభోత్సవానికి ఆహ్వానించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. అలాగే కేంద్ర మంత్రులు, నార్వే, డెన్మార్క్, స్వీడన్ దేశాలకు చెందిన ఎంపిక చేసిన రాయబారులు, జాతీయ స్థాయి పర్యావరణ నిపుణులను కూడా ఆహ్వానించనున్నారు. సదస్సుకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చే ప్రముఖుల ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు.

హరిత పెట్టుబడులకు పెద్దపీట

కేవలం చర్చలకే పరిమితం కాకుండా.. పర్యావరణహిత పెట్టుబడులను ఆకర్షించే వేదికగా ఈ సదస్సును తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్వచ్ఛమైన గాలి, పునరుత్పాదక ఇంధనం, నీటి సంరక్షణ, గ్రీన్ టెక్నాలజీ, వాతావరణ ఆర్థిక సహాయం, సుస్థిర మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలను ప్రదర్శించనున్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించే విధానాలపైనా చర్చించనున్నారు. భూగర్భ జలాల పునరుద్ధరణ, క్షీణించిన భూముల అభివృద్ధి, సూక్ష్మ నీటిపారుదల, నేల సంరక్షణ, నీటి పొదుపుతో కూడిన ఉద్యానవన సాగులో విజయవంతమైన నమూనాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయాలని మంత్రి సూచించారు. మణికొండలో చేపట్టిన భూగర్భ జలాల పునరుజ్జీవన కార్యక్రమం, కన్హా శాంతివనంలో మొక్కల పెంపకం, నేల పరిరక్షణ చర్యలను ఇందుకు ఉదాహరణలుగా ప్రస్తావించారు.

నవంబర్ 28న క్షేత్రస్థాయి సమావేశం

అంతర్జాతీయ సదస్సుకు ముందుగా నవంబర్ 28న వివిధ రంగాలకు చెందిన సుమారు 100 మంది ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని మంత్రి ప్రతిపాదించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్న రైతులు, ఇతర వర్గాల అనుభవాలు, సమస్యలు, అవసరాలను ఈ చర్చల్లో భాగం చేయాలని భావిస్తున్నారు. తద్వారా క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సును తక్కువ సమావేశాలతో, ఎక్కువ ప్రయోజనాలు చేకూరేలా రూపొందించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. కరువు, ఎల్‌నినో సంసిద్ధత, నీటి భద్రత, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, అటవీకరణ, ఎడారీకరణ, స్వచ్ఛమైన గాలి, పునరుత్పాదక ఇంధనం, వాతావరణ ఆర్థిక సహాయం వంటి అంశాలు చర్చకు రానున్నాయి.సదస్సు ముగిసే సమయానికి కేవలం చర్చలే కాకుండా.. రాష్ట్రానికి ఉపయోగపడే ఆచరణాత్మక ప్రణాళికలు, పెట్టుబడి అవకాశాలు, కొలవగల ఫలితాలు రావాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు

- గ్రీవెన్స్ డేలో 15 మంది ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 9(ప్రజా కలం) జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎస్పీ, సమస్యలను తక్షణమే పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు మర్యాదగా వ్యవహరించి, వారి వినతులను స్వీకరించడంతో పాటు సమస్యలపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి వేగంగా స్పందించాలని సూచించారు.

ఏలేటి రాజారామ్ రెడ్డి జ్ఞాపకార్థం భీమన్న గుడికి 2 గుంటల భూదానం

- భూదాత వారి కుమారుడు ఏలేటి చంద్రారెడ్డి



ఎండపల్లి, నవంబర్ 09 : (ప్రజా కలం ప్రతినిధి) మండలం లోని రాజా రాంపల్లి గ్రామం లో కీర్తిశేషులు ఏలేటి రాజారాం రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు ఏలేటి చంద్ర రెడ్డి రైస్ మిల్ పక్కన పెద్దన్న భీమన్న గుడి నిర్మాణం కొరకు 2 గుంటల భూమి స్థలాన్ని యాదవ సంఘానికి స్థలాన్ని భూ దానం చేశారు. అనంతరం భూదాత ఏలేటి చంద్రారెడ్డి గుడి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్య క్రమం లో గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ మేరుగు జంపయ్య, ఏలేటి వారసులు ఏలేటి విజయ మోహన్ రెడ్డి, ఏలేటి రాజేశ్వర్ రెడ్డి, రాందేవ్ రెడ్డి, అనిల్ రెడ్డి, యాదవ సంఘం కుల పెద్దలు, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులను ఘనంగా సన్మానించిన సర్పంచ్ లహరి రాజేష్..



మల్లాపూర్, నవంబర్ 9 (ప్రజాకలం ప్రతినిధి) మల్లాపూర్ మండల పాత్రికేయుల సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రేగుంట గ్రామ సర్పంచ్ తిట్ల లహరి, రాజేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సభవత్ మల్లేష్, ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బద్దం రామచందర్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు నిమిషకవి రాజేష్, గౌరవ సలహాదారు గుగ్గిళ్ల రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి వాసం మధుకర్, శ్యామ్, వార్డు సభ్యులు కలసాని రాజన్న, మహమ్మద్ బషీర్, బాస రాజరెడ్డి, బొల్లారపు లక్ష్మి, బైర లక్ష్మి, మాజీ సర్పంచ్ రంగు రామాగౌడ్, నిమ్మల భూమారెడ్డి, నాయకులు సురకంటి తిరుపతిరెడ్డి, మూడంపల్లి రమేష్, సామ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లి ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ

ఎండపల్లి, నవంబర్ 09 : (ప్రజా కలం ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ సోమవారం రోజును ప్రజావాణి (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ ఆధ్వర్యం లో కార్యక్రమం



నిర్వహించడం జరిగింది. ఇట్టి ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుంచి వచ్చిన నమన్యలకు సంబంధించిన 02 దరఖాస్తులు స్వీకరించ బడ్డాయి. అధికారులు అర్జీలను వెంటనే పరిశీ లించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. ఈ కార్యక్రమం లో హాజరైన వివిధ శాఖల అధికారులు (మొత్తం 10 మంది) హాజరైనట్లు ఎంపీ డీవో తెలిపారు. 1) మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్, 2) మండల వ్యవసాయ శాఖ అధికార కామల్ల మహేష్, 3) మండల విద్యా శాఖ నుండి జూనియర్ అసి స్టెంట్ కిషోర్, 4) వైద్య శాఖ నుండి ఎం పి హెచ్ ఎ ఎస్ శ్రీనివాస్, 5) శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి (సిడిపిఓ డ అంగన్ వాడి) యం ఆండాలు, 6) ఇరిగేషన్ శాఖ నుండి అసిస్టెంట్ ఇంజనీర్ వి. సప్న, 7) ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ / రెంజ్ ఆఫీసర్ ఇస్లావత్ నరేష్, 8) విద్యుత్ శాఖ నుండి ఎం హరీష్, 9) సంక్షేమ శాఖ అధికారి ఎస్ సి డి డి ఎండి అప్సర్, 10) రెవెన్యూ శాఖ నుండి జూనియర్ అసి స్టెంట్ సాయి డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీస్-01, ఇందిరమ్మ ఇల్లు-01 ప్రజా సమస్య లను వెంటనే పరిష్క రించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని ఎంపీ డీవో దొండ కృపాకర్ తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య - 32





జగిత్యాల ప్రతినిధి నవంబర్ 09(ప్రజా కలం):

ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు వరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమన్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు వినతి

- పెద్దపల్లి-జగిత్యాల నూతన రైల్వే లైన్ మంజూరు కొరకు

- మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్

ఎండపల్లి, నవంబర్ 09 : (ప్రజా కలం ప్రతినిధి) పెద్దపల్లి మధ్య కోటి లింగాల, రాయపట్నం, ధర్మపురి మిదుగా జగిత్యాల నూతన రైల్ లైన్ నిర్మాణం కొరకు పెద్దపెల్లి జిల్లా, జగిత్యాల జిల్లా మధ్య లో అనేక ధేవాల యాలు, పర్యటక కేంద్రాలు కలవు అనేక టూరిజం ప్రదేశం కలవు పెద్దపెల్లి మధ్యలో తొలిశాతవాహ నుల రాజధాని కోటి లింగాల 1) పార్వతి పరమేశ్వరుల ఆలయం గంగా నది సమీపం లో ఉన్నాది తొలిశాత వాహను లు పాలించిన ప్రదేశం అలఫే మునులు, ఋషులు తప్పస్సు చేసిన ప్రాంతం 2) అలఫే మంచి ర్యాల జిల్లా గూడెం గుట్ట సత్యనారా యణ స్వామి దేవాలయం కలదు ఇది కూడా గోదావరి నది సమీపం లో కలదు 3) ధర్మపురి నరసింహ స్వామి ఆలయం మరియు యమ ధర్మ రాజు ఆలయం కలదు 4) కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం కలదు 5) వేములవాడ శ్రీ రాజరాజే శ్వర ధక్షణ కాశిగా పిలువ బడుతున్న ఆలయం కలదు ఇన్ని ఆలయాలు ఒకే మార్గం ద్వారా ఉన్నాయి. కాని భక్తులకు దైవ దర్శనం కోరకు రవాణా సౌకార్యం చాలా కష్టంగా ఉంది ఆలయాల సంద ర్శనకు కొన్ని జిల్లాల చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది కావున కొన్ని వందల కిలో మీటర్లు చుట్టు తిరిగి రావాల్సి వస్తుంది ఒకవేల నూతన రైల్వే లైన్ మీరు మంజూరు చేయిస్తే కేవలం సుమారు అరవై కిలో మీటర్లు వస్తుంది కావున అన్ని ఆలయాలకు ఒకే మార్గం ద్వార భక్తులకు చలా సులభంగా దేవుని దర్శనం చేసుకుంటారు గోదావరి పుష్కరాల సమయం లో మహా శివ రాత్రి సందర్భంగా కొన్ని కోట్ల భక్తులు దర్శనం చేసుకుంటారు. కావున మీరు మన ప్రాంత అభి వృద్ధిని దృష్టిలో ఉంచుకొని నూతన రైల్వే మార్గాం మంజూరు చేయవల సిందిగా కోరుతున్నాం. ఈ ప్రాంత ఎంపీలు కరీంనగర్ ఎంపీగా మీరు ఉన్నారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీ కృష్ణ అలఫే నిజామా బాద్ ఎంపీగా ధర్మపురి అరవింద్ గారి పరిధిలోకి నూతన రైల్వే లైన్ వస్తుందని. నూతన రైల్వే లైన్ మంజూరి కొరకు వినతి పత్రం అందజేశారు. దానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ ఈ వినతి పత్రం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవి గారికి సిఫారసు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సీగిరి ఆనంద్, వెల్గటూర్ మాజీ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ తెలిపారు.



సన్న వడ్లకు క్వింటాలుకు రూ.3,500 చెల్లించాలి

- జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక డిమాండ్



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 09(ప్రజా కలం)

సన్న వడ్లకు క్వింటాలుకు రూ.3,500 మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా రైతు ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ.. గత 20 రోజుల క్రితం నిజామాబాద్ ప్రాంతంలో సన్న వడ్లను క్వింటాలుకు రూ.4,000 నుంచి రూ.4,200 వరకు కొనుగోలు చేశారని తెలిపారు. ప్రస్తుతం జగిత్యాల ప్రాంతంలో వరి కోతలు ప్రారంభం కాగా సన్న వడ్లకు కేవలం రూ.2,600 మాత్రమే ధర లభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ప్రభుత్వ సూచనల మేరకు ఏడు రకాల సన్న రకాల వరినే సాగు చేశారని, రబీలో వరి సాగు చేయవద్దని ప్రభుత్వం సూచిస్తుండటంతో ఆ నిర్ణయాన్ని కూడా పాటిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం సన్న వడ్లకు సరైన ధర లేకపోవడంతో క్వింటాలుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు నష్టం వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని సన్న వడ్లను క్వింటాలుకు కనీసం రూ.3,500కు తగ్గకుండా కొనుగోలు చేయడంతో పాటు అదనపు బోనస్ అందించాలని కోరారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షులు నల్ల రమేష్ రెడ్డి, మారు మురళీధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, అనిల్, శ్రీనివాస్, రవి, జగదీశ్, నాగేంద్ర, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాళ్ల జోసెఫ్ ను పరామర్శించిన ఉప సర్పంచ్ చింటూ



తల్లాడ నవంబర్ 9 ప్రజా కలం న్యూస్ కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్ ను మంగాపురం ఉపసర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ పరామర్శించారు. జోసెఫ్ కాలుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చిన నేపథ్యంలో సోమవారం అన్నారుగూడెం గ్రామంలో ఆయన స్వగృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బానోతు బాలు బన్సీ లాల్ ,తదితరులు ఉన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సిఎం చొరవ తీసుకోవాలి

నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 09(ప్రజా కలం)



జగిత్యాల జిల్లాలోని ఏకైక వ్యవసాయ ఆధారిత పరిశ్రమ అయిన ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్ పల్లిలో సోమవారంనాడు విలేకరులతో శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మూసివేసిన ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. గత పాలకుల తప్పుడు విధానాల కారణంగా ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన కారణంగా చెరుకు రైతులతో పాటు షుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడ్డ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని శేర్ నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూసివేసిన ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలని లేకపోతే కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి ఆధ్వర్యంలో షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణే ధ్యేయంగా రాజకీయాలకతీతంగా ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వమే నవసమాజానికి పునాది

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ - 2026 పోస్టర్ విడుదల



పెద్దపల్లి,నవంబర్ 09(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) విద్యార్థుల్లో దాగివున్న శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీసి,సమాజంలో ప్రశ్నించే తత్వాన్ని,పరిశీలనా శక్తిని పెంపొందించేందుకు సైన్స్ సంబరాలు సిద్ధమయ్యాయి.జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్-2026 గోడ పత్రికను సోమవారం పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రామ్‌రెడ్డి,కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీధర్,సురేందర్‌లు ఈ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థి కేవలం పాఠ్యపుస్తకాల బట్టీ చదువులకే పరిమితం కాకుండా,నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృష్టితో పరిశీలించి విశ్లేషించే అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢనమ్మకాలను పారద్రోలి,హేతుబద్ధమైన ఆలోచనలతో ముందడుగు వేసినప్పుడే శాస్త్రీయ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు,ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేసి,విద్యార్థులందరూ పెద్ద సంఖ్యలో ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ శ్రీవిష్ణు,ఉపాధ్యక్షుడు అరెల్లి లక్ష్మణ్,కార్యదర్శులు కె.లక్ష్మణ్,తీట్ల రాజేష్‌తో పాటు పలువురు విద్యావేత్తలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు వినోద్ రెడ్డి శుభాకాంక్షలు



పెద్దపల్లి,నవంబర్ 09:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు విజ్ఞన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం వినోద్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని విజయ రమణా రావు స్వగృహానికి చేరుకున్న వినోద్ రెడ్డి,ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా అల్లం వినోద్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా విజయరమణారావు నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు.ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ,సమస్యల తక్షణ పరిష్కారానికి చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ విప్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తూనే,స్థానికంగా సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు.ప్రజా నాయకుడిగా విజయరమణారావు రాజకీయ ప్రస్థానంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని వినోద్ రెడ్డి ఆకాంక్షించారు.

నిరుపేద కుటుంబానికి అండగా మున్సిపల్ చైర్మన్

అంత్యక్రియల కోసం రూ.10 వేల ఆర్థిక సాయం

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 09 (ప్రజాకలం):- ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అండగా నిలిచారు. పట్టణంలోని 4వ వార్డుకు చెందిన వడ్డెర కులస్తుడు శంశెట్టి రాజు అనారోగ్యంతో సోమవారం కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజు మృతితో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ పందిరి రమేష్ ద్వారా చైర్మన్ మైలారపు లింబాద్రి దృష్టికి వెళ్లింది. విషయం



తెలుసుకున్న చైర్మన్ వెంటనే స్పందించి అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న చైర్మన్‌కు కౌన్సిలర్ పందిరి రమేష్‌తో పాటు మృతుడి కుటుంబసభ్యులు, వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా కలం
మంగళవారం, నవంబర్ 10, 2026

ట్రంప్ ను దెబ్బతీసిన యాంటీ ఇండియా

అమెరికాలో జరిగిన మిడ్ టెర్మ్ ఎన్నికల్లో డెమొక్రాట్ పార్టీని అమెరికన్లు ఆదరించారు. డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే ఇందుకు కారణం. ఇక, అక్కడ ఉన్న భారత సంతతి ఓటర్లు సైతం డెమొక్రాట్లకు మద్దతు ఇచ్చినట్టు వెల్లడయ్యింది. ఎన్నికలకు ముందు నిర్వహించిన పలు సర్వేల్లో 60 శాతానికిపైగా ఇండియన్ అమెరికన్లు ఆ పార్టీకి ఓటేస్తామని చెప్పారు. అమెరికాలో భారతీయుల పట్ల పెరుగుతోన్న జాత్యహంకార ద్వేషం, హెచ్-1 బీ వీసా నిబంధనలు వంటివి ప్రభావితం చేశాయి.అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు నిర్వహించిన సర్వేల్లో భారతీయ-అమెరికన్లు డెమొక్రాటిక్ పార్టీ వైపే మొగ్గు చూపారు. వలస విధానాలు, జాతి వివక్ష, ట్రంప్ పరిపాలన యంత్రాంగం అనుసరించిన వైఖరే ఇందుకు ప్రధాన కారణం. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్, యుగోవ్ భాగస్వామ్యంతో అక్టోబర్ 7 నుంచి 27 మధ్య 1,000 మంది భారతీయ-అమెరికన్లపై నిర్వహించిన సర్వేలో 62 శాతం మంది డెమొక్రాట్లకు ఓటు వేయనున్నట్లు చెప్పగా, కేవలం 19 శాతం మంది మాత్రమే రిపబ్లికన్లకు మద్దతు ఇచ్చారు. మరో 12 శాతం మంది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అలాగే, 46 శాతం మంది తమను డెమొక్రాట్లుగా, 19 శాతం మంది రిపబ్లికన్లుగా, 26 శాతం మంది స్వతంత్రులుగా చెప్పుకున్నారు. డెమొక్రాట్లకు ఓటేయాలనుకున్న వారిలో 35 శాతం మంది ఆ పార్టీపై ఉన్న అభిమానం కంటే రిపబ్లికన్‌లపై ఉన్న వ్యతిరేకతతోనే ఓటేస్తున్నామని చెప్పారు. మిగిలిన 65 శాతం మంది డెమొక్రాటిక్ అభ్యర్థులకు మద్దతుగా ఓటేస్తామని పేర్కొన్నారు.గతంతో పోలిస్తే భారతీయ-అమెరికన్ పురుషుల్లో రిపబ్లికన్ పార్టీకి ఉన్న మద్దతు వేగంగా పడిపోయింది. 40 ఏళ్లు పైబడినవారిలో జనవరికి 32 శాతంగా ఉన్న రిపబ్లికన్ మద్దతుదారులు, సర్వే సమయానికి 16 శాతానికి పడిపోయారు 18 నుంచి 39 ఏళ్ల యువతలో 2024 ఎన్నికలప్పుడు డొనాల్డ్ ట్రంప్‌కు 40 శాతం మద్దతు దక్కగా, ఇప్పుడు కేవలం 23 శాతం మంది మాత్రమే రిపబ్లికన్లను సమర్థించారు.భారతీయ అమెరికన్ల మూడ్ మారడానికి ఇమ్మిగ్రేషన్ విధానాలే ప్రధాన కారణం. హెచ్-1బీ వీసా ఆంక్షలు, డిపోర్టేషన్లు, భారతీయ ఐటీ కంపెనీలపై తనిఖీల వల్ల భారతీయ-అమెరికన్లు ఆందోళన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా నివసించే వృత్తి నిపుణులను, అక్రమ వలసదారులను ట్రంప్ ఒకే గాటన కట్టడం ఐటీ రంగంలో పనిచేసే వారిని తీవ్రంగా ప్రభావితం చేసింది.సర్వేలో పాల్గొన్న వారిలో 48 శాతం మంది భారతీయులను లేదా భారతీయ-అమెరికన్లను లక్ష్యంగా చేసుకుని చేసిన జాతి వివక్ష పూరిత సోషల్ మీడియా పోస్టులను చూశామని చెప్పారు. 25 శాతం మంది తాము నేరుగా జాత్యహంకార వివక్షకు గురయ్యామని తెలిపారు.సెప్టెంబర్ 2026లో యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ 'ట్రాన్స్‌ఫార్మర్స్' క్యారెక్టర్ ఒక సిక్కు డ్రైవర్‌ను నిలదీస్తున్నట్లు ఉన్న ఫోటోను షేర్ చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. దీనిపై తీవ్ర విమర్శలు, నిరసనలు వెల్లువెత్తడంతో తొలగించింది.అక్టోబర్‌లో చికాగో సమీపంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంపై దాడికి కుట్ర పన్నిన 19 ఏళ్ల యువకుడిని అధికారులు అరెస్టు చేశారు. చాలా మంది భారతీయ నిపుణులు తాత్కాలిక హెచ్-1బీ వీసాపై ఉంటూనే అమెరికాలో శాశ్వత నివాస హోదా కల్పించే గ్రీన్ కార్డ్ కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. డెమొక్రాట్ల నేతృత్వంలోని కాంగ్రెస్ గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్‌ను తగ్గించేందుకు ట్రంప్ యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ప్రతి దేశానికి గరిష్టంగా 7% మాత్రమే కోటా పరిమితి, భారత్ నుంచి ఇఁ-2, ఇఁ-3 కేటగిరీలలో దరఖాస్తుదారులు ఎక్కువగా ఉండటంతో ఈ జాప్యం జరుగుతోంది.ఈ బ్యాక్‌లాగ్‌ను తగ్గించాలంటే వార్షిక గ్రీన్ కార్డ్ పరిమితులను పెంచడం, దేశం ప్రాతిపదికన కోటా పరిమితి తొలగించడం లేదా సవరించడం వంటి చట్టసవరణలు అవసరం. ట్రంప్ విధానాలను డెమొక్రాట్లు ప్రశ్నించినప్పటికీ, సడలింపులతో కూడిన సంస్కరణలు తక్షణమే వస్తాయని ఖచ్చితంగా చెప్పలేం. హెచ్-1బి, గ్రీన్ కార్డ్ విధానాలను కాంగ్రెషనల్ కమిటీలు నిర్ణయిస్తాయి. హెచ్-1బీ, గ్రీన్ కార్డ్ చట్టాలకు హౌస్ జ్యుడీషియరీ కమిటీ ప్రధానమైంది. దీని సబ్-కమిటీ అయిన 'ఇమ్మిగ్రేషన్ ఇంటెగ్రిటీ, సెక్యూరిటీ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్-కమిటీ' వలన విధానాల నిబంధనలను రూపొందిస్తుంది. సెనెట్‌లో ప్రవేశపెట్టే వలస చట్టాలకు 22 మంది సభ్యులుండే సెనెట్ కమిటీ ఆన్ ది జుడీషియరీ చాలా ముఖ్యమైనది. దీని పరిధిలోని 'సెనెట్ సబ్‌కమిటీ ఆన్ బోర్డర్ సెక్యూరిటీ అండ్ ఇమ్మిగ్రేషన్' హెచ్-1బి మరియు గ్రీన్ కార్డ్ చట్టాలపై ప్రభావం చూపుతుంది.నిధులు కేటాయించే హౌస్ అండ్ సెనెట్ అప్రాప్రియేషన్స్ కమిటీలు, పరిపాలనా యంత్రాంగాలపై పర్యవేక్షణ ఉన్న హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కమిటీలు కూడా కీలకమే. జనవరి 2027లో కాంగ్రెస్ కొత్త సభ్యులు ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఈ కమిటీలు పునర్వ్యవస్థీకరిస్తారు. కొత్తగా నియమితులయ్యే చైర్‌పర్సన్లు, ర్యాంకింగ్ మెంబర్ల వైఖరిని బట్టి రాబోయే వలస విధాన సంస్కరణల దిశ స్పష్టమవుతుంది. ప్రస్తుతానికి, హెచ్-1బీ, గ్రీన్ కార్డ్ దరఖాస్తుదారులు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ నెలకు ఒకసారి విడుదల చేసే 'వీసా బులెటిన్' కోసం వేచి చూడక తప్పదు.టెక్సాస్ రిపబ్లికన్ అభ్యర్థి బో ఫ్రెంచ్, ఆసియా సంతతి విద్యార్థులు ఫుట్‌బాల్ విజయాన్ని జరుపుకుంటున్న ఫోటోను షేర్ చేస్తూ స్థానికులను విదేశీయులు ఆక్రమిస్తున్నారని కామెంట్ చేశారు. దీనిపై ఆయన తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు.అమెరికా జనాభాలో భారతీయ-అమెరికన్లు 1.5 శాతం (దాదాపు 52 లక్షల మంది) మాత్రమే ఉన్నప్పటికీ, వారి ఓటింగ్ శాతం అత్యధికంగా ఉంటుంది. (2020లో 71%, 2024లో 70%). వీరి సగటు ఆదాయం జాతీయ సగటు కంటే రెండింతలు ఎక్కువ. అమెరికా ఆదాయపు పన్నులో సుమారు 5-6 శాతం (దాదాపు 250 నుంచి 300 బిలియన్ డాలర్లు) చెల్లింపులు వీరివే కావడం గమనార్హం. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీ, న్యూయార్క్‌తో పాటు జార్జియా, మిచిగాన్, పెన్సిల్వేనియా, నార్త్ కరోలినా వంటి స్వింగ్ స్టేట్స్‌లో వీరి ఓట్లు గెలుపోటములను శాసిస్తాయి.

నాలా పేరుతో రియల్టర్ల మాయాజాలం

- అనుమతులు లేని ప్లాట్లుతో ప్రజలకు టోకరా

- ప్రజావాణిలో మాజీ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బండారి సునీల్ గౌడ్ వినతి



అనుమతి లేని అక్రమ వెంచర్

పెద్దపల్లి,నవంబర్ 09:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ 2వ వార్డు,రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 518/4, 519లలో డీటీసీపీ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ వెంచర్‌ను తక్షణమే నిలిపివేయాలని,అమాయక ప్రజలను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండారి సునీల్ గౌడ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన కలెక్టరేట్ పరిపాలన అధికారికి లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సునీల్ గౌడ్ మాట్లాడుతూ సదరు సర్వే నెంబర్లలోని భూములు భూభారతి పోర్టల్‌లో ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే నమోదై ఉన్నాయని,కేవలం నాలా ప్రక్రియ నడుస్తుండగానే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు,భూ యజమానులు డీటీసీపీ లేదా మున్సిపాలిటీ అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్ చేస్తున్నారని ఆరోపించారు.మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రజా అవసరాల కోసం కేటాయించాల్సిన 10 శాతం భూమిని మున్సిపాలిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయకుండా,రేరా నిబంధనలను సైతం ఉల్లంఘిస్తూ రోడ్లు,కాంపౌండ్ వాల్ నిర్మించి ప్లాట్లు అమ్ముతున్నారని మండిపడ్డారు. డీటీసీపీ లేని ప్లాట్లను నాలా ఆధారంగా కొనుగోలు చేస్తే భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతులు రావని,ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ అక్రమ వెంచర్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపించి,రెవెన్యూ అధికారుల ద్వారా నాలా ప్రక్రియను,సబ్ రిజిస్ట్రార్ ద్వారా ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.అలాగే మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని,10 శాతం భూమిని పురపాలక సంఘం పేరిట బదలాయించేలా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్



పెద్దపల్లి,నవంబర్ 09:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని,ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పాలకుర్తి మండలం పుట్నూరు గ్రామానికి చెందిన మేరుగు.లచ్చయ్య సర్వే నెంబర్లు 316/ఈ లో 26 గుంటల భూమి,సర్వేనెంబర్ 430లో 6గుంటల భూమి,సర్వే నెంబర్ 434/A లో 6గుంటల భూమి పాసు పుస్తకంలో నమోదు చేయాలని కొరకు దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ పాలకుర్తి కు రాస్తూ పరిశీలించాలని ఏవో తెలిపారు.ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన కర్రె.భాగ్యలక్ష్మి తనకు గృహ జ్యోతి పథకంలో 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ అమలు కావడంలేదని దరఖాస్తు చేసుకోగా ఓదెల ఎంపీడీవోకు రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఎలిగేడు మండలం లోకాపేట గ్రామానికి చెందిన పాపని.అనూష తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హోసింగ్ కు రాస్తూ పరిశీలించాలని ఏవో తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ హెచ్.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర్, సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పేరిట సాగుతున్న బహుజన వ్యతిరేక ప్రచారాలను,

కార్పొరేట్ దందాను తిప్పికొట్టాలి!

- బహుజన చారిత్రక సత్యాలను గుర్తించాలి.. రాజుల త్యాగాలను స్మరించాలి



ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, నవంబర్ 10

దీపావళి పండుగ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్యవేదిక, స్వయం గౌరవ ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో బహుజన చారిత్రక సత్యాలను గుర్తించండి.. బహుజన రాజుల త్యాగాలను స్మరించండి అనే నినాదంతో స్వయం గౌరవ స్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో సామాజిక ఉద్యమకారులు, పేదల డాక్టర్ డాక్టర్ భాను ప్రసాద్, మధు, కిషోర్ మహారాజ్, దాసరి సాయన్న, ముసలి సతీష్, ఏవీ రావు, ప్రముఖ న్యాయవాదులు బాదం ఆదినారాయణ, శ్రీనివాస్, మెజీషియన్ అలవాల తిరుపతి, సిద్ధార్థ పూలే, సూర్యకాంతం, అల్లాడి పౌల్ రాజ్, మట్టా నరసింహారావు, అలవాల రాజాపెరియార్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురాణాల పేరుతో ఈ దేశ మూలవాన ప్రజల రక్షకుడైన నరకానురుడిని ప్రతినాయకుడిగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండించారు. నరకాసురుడిని వధించిన రోజును పండుగగా జరపడం వెనుక ఉన్న సామాజిక కోణాన్ని, బహుజనులు చారిత్రక దృక్పథంతో పరిశీలించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బహుజన చక్రవర్తి బలి చక్రవర్తిని పాతాళానికి తొక్కేశారనే కథల వెనుక ఉన్న ఆధిపత్య ధోరణిని ప్రశ్నించాలన్నారు. మూలవాసుల సంస్కృతిని, శ్రమను గౌరవించడమే నిజమైన పండుగ అని పేర్కొన్నారు. ధనత్రయోదశి, లక్ష్మీపూజల పేరుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలను బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ శక్తులు వినియోగ సంస్కృతి మాయాజాలంలోకి నెట్టి దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. అప్పులు చేసి మరీ బంగారం, విలాసవంతమైన వస్తువులు కొనాలనే ఆడంబర సంస్కృతిని శ్రామిక వర్గం తిప్పికొట్టాలని అన్నారు. సంపద ఆకాశం నుంచి ఊడిపడేది కాదని, శ్రమజీవుల చెమట చుక్కల ఫలితమేనని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వేల రూపాయలు ఖర్చు చేస్తూ గాలిని విషపూరితం చేసే రసాయన బాణాసంచాకు దూరంగా ఉండాలని సూచించారు. బాణాసంచా వల్ల శబ్ద, వాయు కాలుష్యం పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రసాయన బాణాసంచా సంస్కృతిని విడనాడి మట్టి ప్రమిదలతో నిరాడంబరంగా, పర్యావరణహితంగా పండుగ జరుపుకోవాలని కోరారు. సమాజంలో ఆకలి, పేదరికం, వివక్ష అనే చీకట్లు తొలగిపోయి ప్రతి ఒక్కరికీ విద్య, ఉపాధి, సామాజిక న్యాయం అందినప్పుడే దేశానికి నిజమైన వెలుగులు వస్తాయని అన్నారు. ఆధిపత్య కులాల కథనాలకు, ఆడంబరాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయ దృక్పథం, చారిత్రక స్పృహ, సామాజిక ఐక్యతతో పండుగలను అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు, సమాజ సేవకులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, దళిత ఉద్యమ నాయకులు శ్రీధరగడ్డ శేఖర్, కోకిల గాంధీ, వీరబాబు, విజ్ఞాన వేదిక నాయకులు వెంకట్ వీరయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు.

అన్నారుగూడెంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు..



తల్లాడ నవంబర్ 9 ప్రజా కలం న్యూస్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి వెలుగులు కార్యక్రమాలు చేపట్టాలనే పిలుపు మేరకు తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు గోవిందు విజయమ్మ ఆధ్వర్యంలో గోవిందు సురేంద్ర నూతన గృహం వద్ద ఈ కార్యక్రమాలు చేపట్టారు. గృహంలో దీపాలు వెలిగించి టపాసులు కాలుస్తూ ఆనందోత్సవాలు నడుము ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ) హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గడేసుల ఆనందరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవిందు శ్రీనివాసరావు ట్రాక్టర్, పొన్నం కృష్ణయ్య, గోవిందు నరసింహారావు, కొత్తపల్లి దానయ్య, తాళ్ల అగస్టిన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీగోడ నిర్మించాలి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 09 (ప్రజాకలం): మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ఇందిరా ప్రియదర్శిని కాలనీలోని యంపీపీఎస్ ఐపీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీగోడ నిర్మించాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ రెబ్బని మహేష్ మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ.. పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 38 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాల చుట్టూ ప్రహరీగోడ లేకపోవడంతో పశువులు, కుక్కలు, పందులు, మేకలు, పాములు తదితరాలు ఆవరణలోకి వస్తున్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా సాయంత్రం వేళల్లో కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం సేవిస్తూ, మద్యం సీసాలు పగులగొట్టడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్యార్థుల భద్రత, పాఠశాల ఆస్తుల పరిరక్షణతో పాటు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు వెంటనే ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు కాజా ఆజిమ్, కొత్త గంగ నరసయ్య, కనకతార తదితరులు పాల్గొన్నారు.

బస్సు కోసం అధికారులకు వినతి



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్09(ప్రజా కలం)

మెట్‌పల్లి నుంచి ఆత్మకూర్ మీదుగా వేములవాడకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలని జగ్గాసాగర్ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెల్లుల్ల,బండలింగాపూర్, జగ్గాసాగర్, ఆత్మకూర్ తదితర గ్రామాల ప్రజలతో పాటు భక్తులకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వేములవాడ, రుద్రంగి ప్రాంతాలతో ఆయా గ్రామాల ప్రజలకు నిత్య ప్రజా సంబంధాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులుగా మెట్‌పల్లి, ఆత్మకూర్, వేములవాడ మార్గంలో ఆర్టీసీ బస్సు నడపాలని సాయగౌడ్ అధికారులను కోరారు.

బానోత్ కిషన్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే

డీఎస్ రెడ్యానాయక్ పరామర్శ



మరిపెడ, ప్రజా కలం న్యూస్ నవంబర్ 9: మరిపెడ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బానోత్ కిషన్ అత్త అయినటువంటి గుగులోతు అములు స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ ఆదివారం మరిపెడ బంగ్లాలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుగులోతు అములు మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ధైర్యంగా ఉండాలని, ఈ కష్ట సమయంలో మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో మాలి బాలాజీ, ఉర్లగుండ శీను, మాలి ప్రతాప్ సింగ్, నాగేశ్వరరావు, శరణ్ సింగ్, స్వామి, సేట్రాం రాము, వస్త్రం తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డు

గోమఠం రంగాచార్యులు విద్యార్థులతో ముచ్చట్లు



తల్లాడ, నవంబర్ 9 (ప్రజా కలం న్యూస్): కథ ఒక ఆలోచన, నాటిక దానికి ప్రాణం. . తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకున్న ప్రముఖ రంగస్థల కళాకారులు, రచయిత, రిషి వ్యాలీ స్కూల్ మదనపల్లె గోమఠం రంగాచార్యులు గారు విద్యార్థులతో గడిపి, కథ రాయడం నుంచి దానిని నాటికగా మలచడం వరకు మొత్తం ప్రయాణాన్ని సులభంగా, ఆసక్తికరంగా వివరించారు.మంచి కథకు పెద్ద పదాలు అవసరం లేదు, నిజాయితీ, కల్పన, ఒక స్పష్టమైన సందేశం ఉంటే చాలు. ఆ కథను మాటలతో, కదలికలతో, భావోద్వేగాలతో నాటికగా మార్చినప్పుడు, అది పిల్లల జీవితంలో ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుందని గోమఠం రంగాచార్యులు వివరించారు. మండల విద్యాశాఖ అధికారి ఎన్. దామోదర ప్రసాద్ పాల్గొని విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడం విద్యాభివృద్ధిలో ఎంతో కీలకమని,కథలు, నాటికల వంటి కార్యక్రమాల ద్వారా పిల్లలు తమలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, దానిని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. నైపుణ్యాలను పెంపొందిస్తాయని ఆశిస్తూ భవిష్యత్తులో మరిన్ని సృజనాత్మక శిబిరాలు, సాహిత్య రంగస్థల కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని విద్యాసంస్థలు కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కోటగిరి రాధా, కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, తెలుగు పండితుడు ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి ప్రాణం కాపాడిన ఎస్డిఆర్ఎఫ్ 4వ బెటాలియన్ కానిస్టేబుల్ విజయ్



హనుమకొండ నవంబర్ 9 ప్రజాకలం ప్రతినిధి
వరంగల్ చింతల్ బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వృద్ధుడిని (సుమారు 60 సంవత్సరాల వయసు) సకాలంలో ప్రథమ చికిత్స అందించి,ప్రాణాపాయం నుండి తప్పించిన ఎస్డిఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) 4వ బెటాలియన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ (పిసి -348) పి.విజయ్.ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన పిసి విజయ్, తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్న బాధితుడికి తొలుత మానసిక ధైర్యాన్ని (మోరల్ సపోర్ట్) అందించారు. బాధితుడి నుండి అవుతున్న తీవ్ర రక్తస్రావాన్ని అత్యంత నైపుణ్యంతో అదుపు చేశారు.ప్రమాద సమయాల్లో అత్యంత కీలకమైన శ్వాసనాళాన్ని (ఎయిర్‌వే) తనిఖీ చేసి,బాధితుడి శ్వాస సజావుగా సాగేలా చూశారు. ఈ విధంగా బాధితుడి పరిస్థితిని పూర్తిగా స్థిరపరిచిన (స్టెబిలైజ్) అనంతరం,తదుపరి మెరుగైన ఉన్నత వైద్య సంరక్షణ కోసం బాధితుడిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రాథమిక అత్యవసర చికిత్స పద్ధతులను పాటించి ఒకరి ప్రాణాన్ని కాపాడిన పిసి-348 విజయ్‌ను 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాసరావు మరియు బెటాలియన్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. విజయ్ చూపిన మానవత్వం, విధి నిర్వహణ పట్ల అంకితభావం తోటి సిబ్బందికి ఆదర్శనీయమని కమాండెంట్ ఈ సందర్భంగా కొనియాడారు.

నిరుపయోగంగా ఉన్న బోర్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

- కాలనీల్లో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- టీడీపీ నేత టైగర్ రమేష్ కొప్పుల



నాగర్‌కర్నూల్ నవంబర్ 09 (ప్రజాకలం): పట్టణంలోని వివిధ కాలనీల్లో నిరుపయోగంగా ఉన్న బోర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని టీడీపీ నేత టైగర్ రమేష్ కొప్పుల అధికారులను కోరారు. కాలనీల్లో నెలకొన్న బోర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.పట్టణంలోని ఎర్రగడ్డ కాలనీలో బ్రిలియంట్ స్కూల్ ఎదురుగా ఉన్న హ్యాండ్ బోరు నిరుపయోగంగా ఉండటంతో పాటు, బోరు తెరిచి ఉండడం వల్ల విద్యార్థులు, కాలనీవాసులకు ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బోరుకు మోటారు బిగించి నీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.
అదేవిధంగా హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రభుత్వ స్థలంలో ఉన్న బోరును కూడా ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. బోరు వద్ద పబ్లిక్ ట్యాప్ లేదా నీటి ట్యాంకు ఏర్పాటు చేసి కాలనీవాసులకు నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు.ప్రభుత్వానికి చెందిన నీటి వనరులు వ్యక్తిగత అవసరాలకు కాకుండా ప్రజలందరికీ ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే బోర్లు నిరుపయోగంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ నాయుడు, కాలనీవాసులు వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి లో ఫిర్యాదులపై తక్షణమే స్పందించి

బాధితులకు న్యాయం చేయాలి

- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



నిర్మల్ నవంబర్ 09 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖ అండగా ఉంటుందని, బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, తెలిపారు. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను ఆమె స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు తమ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించడం, వారి మాటలను ఓపికగా వినడం, సమస్యను అర్థం చేసుకొని చట్టప్రకారం పరిష్కారం చూపడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని ఎస్పీ తెలిపారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు బాధితులకు అండగా నిలవడం, వారి సమస్యలను పరిష్కరించడం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని పరిష్కారం కోసం నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సహకారం అందించాలని స్పష్టం చేశారు. పోలీసులు ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే నిర్మల్ పోలీసుల లక్ష్యమని తెలిపారు.

దళిత జాతి సంక్షేమమే ప్రధాన ఎజెండా

- ఆదిజాంబవ సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్



(వరంగల్/పర్వతగిరి)నవంబర్ 09, ప్రజాకలం ప్రతినిధి:
దళిత జాతి సంక్షేమమే ఆదిజాంబవ సంక్షేమ సంఘం ప్రధాన లక్ష్యం అని ఆ సంఘ మండల అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్ అన్నారు. పర్వతగిరి మండల ఆదిజాంబవ సంక్షేమ సంఘం మొదటి మండల స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయి మండల కమిటీ నీ ఎన్నుకున్నారు. ఈ కమిటీ కి మండల అధ్యక్షుడిగా చిన్నపాక శ్రీనివాస్ ను అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతిని ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా బలోపేతం చేయడమే ఆది జాంబవ సంక్షేమ సంఘం యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ సంక్షేమ సంఘంలో పర్వతగిరి మండలంలోని అన్ని గ్రామాల నుండి సుమారుగా 150 మంది సభ్యులుగా ఉన్నారని రాబోయే రోజుల్లో వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అన్నారు. ప్రతి నెల సభ్యులు స్వచ్ఛందంగా కొంత డబ్బు పోగు చేసుకొని పర్వతగిరి మండలంలోని దళిత కుటుంబాల్లో ఎవరికి ఏ రకమైన ఆపద వచ్చినా కమిటీ సభ్యులందరి ఏకాభిప్రాయం మేరకు వారికి ఆర్థిక సహాయం అందించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామని అన్నారు. ఇప్పటికే దౌలత్ నగర్, ఏనుగల్లు, సోమవారం, వడ్లకొండ గ్రామాలలో సంఘం ద్వారా 40000 రూపాయలు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అత్యవసర ఆపద సమయం లో ఆర్థిక సహాయం అందించుట ద్వారా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని తద్వారా ఆ కుటుంబ మనుగడకు చేయూతను అందించవచ్చు అనే ఉద్దేశంతో ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. వర్వతగిరి మండలంలో ఆదిజాంబవ సంక్షేమ సంఘం ద్వారా దళిత జాతి లో ఐక్యత తీసుకువచ్చి రాజకీయాలకు, సంఘాలకు అతీతంగా అందరూ ఒక్క తాటి పై నడుస్తూ బలమైన శక్తిగా మారాలనేది సంఘం యొక్క అంతిమ లక్ష్యం అన్నారు.
నూతనంగా ఎన్నుకోబడిన ఆదిజాంభవ సంక్షేమ సంఘం పర్వతగిరి మండల కమిటీ లో మండల అధ్యక్షుడిగా చిన్నపాక శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు వంగాల రవీందర్, జంగిలి బాబు, మాదాసి సుధాకర్, ఉపాధ్యక్షులు జిల్లా మాసాని యాకూబ్, ప్రధాన కార్యదర్శిలు బోట్ల కనకరాజు, వల్లందాసు వెంకటేశ్వర్లు, మాసాని సమ్మయ్య, దబ్బట యాలాద్రి, కార్యదర్శిలు వల్లందాస్ కుమార్, బర్ల రాజశేఖర్, సిరిపురం కుమారస్వామి, మంద రాజేందర్, మీడియా ప్రతినిధులు, పోడేటి దయాకర్, బోట్ల భాస్కర్, గడ్డం యాకాంబరం, మునిగే శ్రీకాంత్, జిల్లా రమేష్, చిన్నపాక శ్రీకాంత్, కోశాధికారి కందికట్ల ప్రవీణ్, అధికార ప్రతినిధి జంగిలి యాకయ్య, ఆబర్ల రవి, భాషిపాక రాజు, ప్రచార కార్యదర్శి, గౌరారపు యుగేందర్, డెక్క అశోక్, బరిగల వెంకటేశ్వర్లు, గౌరారపు రాజు, నరుకుడు రమేష్, సలహాదారులు. దండం పెళ్లి సైదులు, జంగిలి భాస్కర్, జన్ను నరసయ్య, రాపాక నాగయ్య, కందికట్ల భాస్కర్, రాపాక శ్రీనివాస్, పసుల శ్రీనివాస్, కందికట్ల యాకయ్య, నక్క రాములు తదితరులు ఎన్నుకోబడ్డారు.

ఎల్‌నినో ముప్పు.. ప్రత్యామ్నాయ పంటలే రైతులకు రక్ష!

తక్కువ నీటితో సాగయ్యే పప్పుదినుసులు, ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి
నీటి వృథాను అరికట్టి.. భూగర్భ జలాలను కాపాడుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి
రైతు సదస్సు వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించిన కలెక్టర్ సత్యశారదాదేవి, ఎమ్మెల్యే నాగరాజు

నవంబర్ 09 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట)
వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులు ఎదుర్కొనే ప్రతికూల పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రైతు సదస్సు కార్యక్రమంలో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.వర్ధన్నపేట రైతు వేదికలో నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్వయంగా వీక్షించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో హెచ్చుతగ్గులు, నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉండే వంటలపై పూర్తిగా ఆధారపడకుండా, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు. ముఖ్యంగా మొక్కజొన్న, వేరుశనగ, కంది తదితర పప్పుదినుసులు, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని వివరించారు.

నీటి ప్రతి చుక్కా విలువైనదే

భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా, పంటకు ఎంత నీరు అవసరమో అంతే వినియోగించాలని సూచించారు. వీలైన చోట్ల బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా నీటిని ఆదా చేయవచ్చని వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళికలు, శాస్త్రీయ సాగు విధానాలు ఎంతో అవసరమని ఈ సందర్భంగా వివరించారు. రైతులు పంటల ఎంపిక నుంచి సాగు పద్ధతుల వరకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపడితే నష్టాలను కొంతమేర తగ్గించుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి సందేశాన్ని ఆసక్తిగా వీక్షించిన రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటామని రైతులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ విజయసాగర్, వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుళ్ల రవి, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, వాణి-కుమారస్వామి, దేవేందర్, కమిలి, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, సర్పంచులు, ఉపసర్పంచులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళాం

మామడలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



నిర్మల్, నవంబర్ 09 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలను కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్పంచ్ పందిరి చంద్రకళ సురేందర్, ఉప సర్పంచ్ గోవర్ధన్ ప్రవీణ్ కుమార్, సొసైటీ నాయకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ చేసిన కృషి మహోన్నతమైనదని కొనియాడారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సొసైటీ వ్యవస్థాపకులు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మహనీయుల సేవలను స్మరించుకుంటూ 15 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఉన్నత, సాంకేతిక విద్య ఉన్నతికి ఆజాద్ ప్రణాళికాబద్ధంగా కృషి చేశారని చెప్పారు. ప్రతిభ గల విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలను గుర్తించి వారికి సముచిత ప్రాధాన్యతనిచ్చి పదవులు అందజేశారని గుర్తుచేశారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా అందరూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ ఖదీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇంతియాజ్, కోశాధికారి షేక్ షాదుల్లా హుస్సేన్, మహమ్మద్ కరీముద్దీన్, మహమ్మద్ జుబేర్ హుస్సేన్ ఖాన్, తాజీమ్ ఖాన్, మస్జిద్ కమిటీ అధ్యక్షులు షేక్ అష్ఫాఖ్, అజీజ్, ముదస్సిర్, ఫారూఖ్ బేగ్, ఆసీం, ఆర్షద్, సాయి, శ్రీకాంత్, అరుణ్, రషీద్, జాకీర్, అవేజ్, నజీర్, జమీల్, జమీర్, దిల్షాద్, ముబీన్ పాషా, నరేష్, దొడ్ల సొసైటీ మామడ మండల బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి టి.పి.టి.ఎఫ్. మండల అధ్యక్షులుగా భోజ్య
ప్రధాన కార్యదర్శిగా వసంతరావు ఎన్నిక

ఆళ్లపల్లి,నవంబర్ 09,ప్రజాకలం : ఆళ్లపల్లి మండల టి.పి.టి.ఎఫ్. నూతన కమిటీ ఎన్నికలు మండల పరిధిలోని మైలారం పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షులుగా బి. భోజ్య, ప్రధాన కార్యదర్శిగా కె. వసంతరావు ఎన్నికయ్యారు. మండలంలోని టి.పి.టి.ఎఫ్. సభ్యుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల అధికారులుగా టి.పి.టి.ఎఫ్. జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, జి. కిషన్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు పలువురు ఉపాధ్యాయులు, సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘాన్ని మండల స్థాయిలో మరింత బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల ఐక్యత, సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి అతిథులుగా కె. వెంకటేశ్వర్లు, జి. సమ్మయ్య హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. కుమార్ రాజా, రమేష్, రామయ్య, రామకృష్ణ, సంపత్, శ్రీను, చిన్న, నీలావతి, స్వరూప, పూర్ణ, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, నెహ్రూ, తులసిరాం, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, మోహన్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హామీలు అమలు చేయకుండా
వికలాంగుల అరెస్టులా?

అరెస్టులను చేయడాన్ని తీవ్రంగా ఖండించిన ఎన్‌పీఆర్‌డీ నాయకులు



నాగర్‌కర్నూల్ నవంబర్ 09 (ప్రజా కలం): వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, తమ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న వికలాంగులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎన్‌పీఆర్‌డీ వికలాంగుల సంఘం నాయకులు పులిజాల బాలీశ్వర్, కోట్ల గౌతమ్ ఒక ప్రకటనలో అన్నారు. సోమవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వికలాంగులను పోలీసులు వారి ఇళ్ల వద్దే అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో వికలాంగులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్టు చేయడం ఇదే తొలిసారి అని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. వికలాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ, ఆ హామీ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. కనీసం పురుష వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్న చిన్న హామీని కూడా అమలు చేయలేకపోతున్నారని విమర్శించారు. హామీల అమలు గురించి ప్రశ్నిస్తారనే భయంతోనే ముందస్తుగా వికలాంగులను అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో వికలాంగుల ఉద్యమాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. అరెస్టులకు భయపడకుండా జిల్లావ్యాప్తంగా వికలాంగులను ఐక్యం చేసి, రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అణచివేత చర్యలను విడనాడి, వికలాంగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వెలుగుమట్ల బాధితులపై కేసులు కాదు..

ఇళ్లు కూల్చిన అధికారులపై కేసులు పెట్టాలి

మాపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి : బాధితులకు
ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి డాక్టర్ విశారదన్ మహరాజ్



ఖమ్మం, నవంబర్ 09(ప్రజా కలం న్యూస్)
వెలుగుమట్ల భూదాన భూముల పోరాటానికి సంబంధించి డాక్టర్ విశారదన్ మహరాజ్‌పై ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ఆయన పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు . ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా వెలుగుమట్ల భూదాన భూముల్లో నివాసముంటున్న పేదలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తెల్లవారుజామున ఇళ్ల నుంచి బయటకు పంపించి ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని అన్నారు . రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించిన అధికారులు, ప్రభుత్వంపై కేసులు నమోదు చేయాల్సిందిపోయి, బాధితుల తరఫున పోరాడుతున్న తమపై కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. తమ పోరాటాల ఫలితంగా 300 మంది బాధితులకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వడం ప్రభుత్వం గతంలో చేసిన తప్పును అంగీకరించినట్లేనని పేర్కొన్నారు . తమపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకొని బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు . వెలుగుమట్లలో ఇంకా 20 ఎకరాల భూమి అందుబాటులో ఉందని , అర్హులైన మిగతా బాధితులను గుర్తించి వారికి కూడా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని , లేనిపక్షంలో మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు . జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొదకంటి రాంబాబు మాట్లాడుతూ.. ఇది అణగారిన కులాల ఆత్మగౌరవ పోరాటమని, స్థానిక ఎమ్మెల్యే ఇకనైనా తన వైఖరిని మార్చుకొని మిగిలిన అర్హులైన బాధితులకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు . ప్రముఖ న్యాయవాది వంజాకుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పోరాట యోధులపై పెట్టిన తప్పుడు కేసులను పోలీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోలీసులపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సామాజిక విశ్లేషకులు గర్జన్ , జేఏసీ జిల్లా కన్వీనర్ కేతవరపు కృష్ణారావు , కో-కన్వీనర్ రాజేష్ , కమిటీ సభ్యులు కటకం లక్ష్మి , కృష్ణ , ఉదయ్ , నవ్య , నరేష్ , ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు .

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా : ప్రజావాణిలో 58 వినతుల స్వీకరణ



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 09:

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూధన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, ప్రతి ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజావాణి దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, వాటిలోని అంశాలను పూర్తిగా అర్థం చేసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, నీటిపారుదల, సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాలు,భూ సర్వే-రికార్డులు, గృహ నిర్మాణం, రవాణా, పోలీసు, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్యం, గనులు, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 58 వినతులను అధికారులు స్వీకరించారు.

మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మండల ప్రత్యేక అధికారుల ప్రతి వారం నిర్వహించే క్షేత్రస్థాయి పర్యటన పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మండల ప్రత్యేక అధికారి వారంలో ఒక రోజు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,గ్రామపంచాయతీలను తనిఖీ చేయాలని సూచించారు. పర్యటించిన ప్రాంతాల పేర్లు, అక్కడ గుర్తించిన సమస్యలు సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కారం కు బాధ్యత తో కృషి చేయాలని సూచించారు.వారు పర్యటించిన వివరాలు టూర్ డైరీ కలెక్టరేట్ ఏ.ఓ .కు సమర్పించాలని అన్నారు, ప్రతి వారం పర్యటనల ఫొటోలు, వివరాలను మండల ప్రత్యేక అధికారుల వాట్సాప్ గ్రూపులో షేర్ ఆదేశించారు. పర్యటనల సందర్భంగా ముఖ్యంగా పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను, ప్రహరీ గోడలు, ఆటస్థలాలు, తదితర అంశాలను పరిశీలించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సమస్యలను ఏమైనా గుర్తిస్తే వాటిని కూడా పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో గుర్తించిన ప్రతి సమస్యలను సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత ప్రత్యేక అధికారులదేనని పేర్కొన్నారు.జిల్లాలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీరు, విద్యుత్ పొదుపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నీటి లీకేజీలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, విద్యుత్ వృథాను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయన్న ఫిర్యాదులపై స్పందిస్తూ, ఆటోమేటిక్ స్విచ్‌లు పనిచేయకపోతే మాన్యువల్ విధానంలోనైనా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు.ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టే పనులను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేయాలని తెలిపారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులకు బదులుగా మొక్కల పెంపకం, రహదారుల మరమ్మతులు వంటి అవసరమైన పనులను చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో పనుల జాబితాను పరిశీలించి, షెల్ఫ్‌లో ఉన్న పనుల వివరాలను తనకు అందజేయాలని ఆదేశించారు. కె జి. బి.వి పాఠశాలలో ఎక్కడైనా సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా కారణంగా మోటార్లు దెబ్బతింటున్నట్లు గుర్తిస్తే ఆ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చోట త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా కల్పించాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై అందిస్తున్న విత్తనాల పంపిణీ పై రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పించి, పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ, జెడ్.పి.సి.ఈ.ఓ, ఇన్‌చార్జి డి.పి.ఓ వెంకట్‌రెడ్డి, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ యాదగిరి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం నవంబర్ 09(ప్రజాకలం న్యూస్) ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.లికలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ , అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, ఎల్నినో నేపథ్యంలో పంట రుణాల వడ్డీ మాఫీ చేసి రెన్యువల్ చేయాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి పత్తికి, మిర్చికి 50 వేల రూపాయలు వరి పంటకు 30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని, పంటల బీమా పథకం అమలు చేయాలని, కూరగాయల, పండ్ల తోటలను కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోనకల్ మండలం మోటమర్రి గ్రామ సర్పంచ్ ఎం. సురేష్ గ్రామ పరిధిలోని ఇసుక క్వారీ నుండి ఇసుక రవాణా కొరకు అధికారికంగా అనుమతి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మైన్స్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెనుబల్లి మండలం జెడ్పీహెచ్ఎస్ కొండ్రుపాడు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుని కేటాయించవలసిందిగా కోరుతూ గ్రామ పెద్దలు దరఖాస్తు సమర్పించగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ ప్రాధాన్యత క్రమంలో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిఓ 59 దరఖాస్తుల పరిశీలన పురోగతిపై సంబంధిత జిల్లా అధికారులను అడిగి, ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలనీ, భూమి విస్తీర్ణం, హద్దులు, భూమి స్వభావాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలనీ సూచించారు. ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం చేయరాదు

– జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 09 ప్రజా కలం జిల్లా ప్రతినిధి)ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి లాగిన్‌లో నమోదైన ప్రతి దరఖాస్తుకు నిబంధనల ప్రకారం సముచిత సమాధానం అందించాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రత్యేకంగా గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అటల్ పెన్షన్ యోజన అమలులో నిర్మల్ జిల్లాకు ఎక్సలెన్స్ అవార్డు

అటల్ పెన్షన్ యోజన అమలులో 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్మల్ జిల్లా 95 శాతం నమోదు లక్ష్యాన్ని సాధించి ఎక్సలెన్స్ అవార్డును దక్కించుకుంది. జిల్లాలో మొత్తం 56,145 మంది ఈ పథకంలో చేరగా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు విశేష కృషి చేశారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీఎఫ్ఆర్‌డీఏ సీజీఎం ఆశుతోష్ కుమార్ చేతుల మీదుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ అవార్డును అందుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ అవార్డును జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎల్‌డీఎం రాంగోపాల్‌ను అభినందించారు. జిల్లాకు ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన బ్యాంకు అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం.. ప్రతి గడపలో దీపావళి వెలుగులు!

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేళ ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లలో సంబురాలు

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు రుణపడి ఉంటాం.. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి జ్యోతి ప్రజ్వలన -శాలువాలతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేసిన పట్టణ కాంగ్రెస్ నేతలు



నవంబర్ 09 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట):పేదల సొంతింటి కల సాకారమై.. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. సొంత గూడు నిర్మించుకోలేమేమోనని ఆవేదనలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కొండంత భరోసానిచ్చింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా వర్ధన్నపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గడపల్లో దీపావళి వెలుగులు విరాజిల్లాయి. తమకు సొంతింటి భాగ్యం కల్పించడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లి'మా జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపిన లిఎమ్మెల్యే నాగరాజుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నేతృత్వంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన అర్హులైన పేదలను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేసి, వారి సొంతింటి కలను సాకారం చేసే దిశగా చర్యలు చేపట్టారు. దీంతో లబ్ధిదారులు తమకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుని కొత్త ఇంటిలో అడుగుపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల వేళ తమ ఇంటి గడపలో వెలిగిన దీపం వారి జీవితాల్లో కొత్త ఆశలకు నాంది పలికింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. గతంలో ఇందిరమ్మ హయాంలోనే పేదలకు ఇళ్ల నిర్మాణాలు జరిగాయని, ఆ తర్వాత తమలాంటి నిరుపేదలకు సొంతింటి కల నెరవేరే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులోకి రావడంతో తమ ఆశలు చిగురించాయని తెలిపారు. జీవితంలో సొంత ఇల్లు నిర్మించుకోలేమని నిరాశలో ఉన్న తమకు ప్రభుత్వం అందించిన అవకాశంతో సొంతింటి కల నిజమైందన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు జీవితాంతం కృతజ్ఞులమై ఉంటామని పేర్కొన్నారు.

లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. దీపావళి సంబురాలు!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లారు. కొత్తగా నిర్మించుకున్న ఇళ్లలో జ్యోతి ప్రజ్వలన చేసి, లబ్ధిదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. లబ్ధిదారులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఒకవైపు ఇంటి గడపలో వెలిగిన దీపాలు.. మరోవైపు బాణసంచా వెలుగులు.. ఇంకోవైపు ఆత్మీయ సత్కారాలతో ఆయా కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. నాయకులు తమ ఇళ్లకు వచ్చి ఆనందంలో పాలుపంచుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పేదల ఇంటి కల నెరవేరినప్పుడే నిజమైన పండుగ అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, ఒకటో డివిజన్ కౌన్సిలర్ బెజ్జం పాపారావు, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, ఎండీ అప్సర్, రజిత రెడ్డి, మూడో డివిజన్ అధ్యక్షుడు కొండేటి సుధాకర్, ఒకటో డివిజన్ అధ్యక్షుడు బంగారు రవి, వెంకట్ గౌడ్, సోహైల్, ఐత యాకాంతం, ఎర్ర శ్రీకాంత్, ఐత సుధాకర్, ప్రభాకర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించి

పార్లమెంటులో చట్టం చేయాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు డిమాండ్



నాగర్ కర్నూల్ నవంబర్ 09 (ప్రజా కలం) : దేశవ్యాప్తంగా రైతులు పండించిన అన్ని రకాల పంటలకు డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర నిర్ణయించి, పార్లమెంటులో చట్టం చేయాలని తెలంగాణ రైతు సంఘం నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాగర్ కర్నూల్ పట్టణంలో అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. నవంబర్ 15, 16, 17, 18 తేదీల్లో నల్లగొండ పట్టణంలో అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 15న లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి రైతు ఉద్యమాల్లో అనుభవం కలిగిన సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన దేశవ్యాప్త రైతాంగ ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిన చారిత్రాత్మక గడ్డ నల్లగొండలో అఖిల భారత మహాసభలు నిర్వహించడం గర్వకారణమన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో కేరళ, బెంగాల్, మహారాష్ట్ర, త్రిపుర, ఒడిశా తదితర రాష్ట్రాల్లో రైతాంగ ఉద్యమాలు విస్తృతంగా జరిగాయని గుర్తు చేశారు. అదే పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను బలోపేతం చేస్తామని అన్నారు. దేశంలోని రైతులు పండించిన అన్ని రకాల పంటలను ప్రభుత్వాలే నేరుగా కొనుగోలు చేయాలని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు కేకే రాగేష్ ఐదేళ్ల క్రితం మద్దతు ధరల చట్టం కోసం పార్లమెంటులో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు దానిపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు.మద్దతు ధరలు అమలు కాకపోవడంతో దేశవ్యాప్తంగా రైతులు ఏటా రూ.5 లక్షల కోట్ల మేర నష్టపోతున్నారని, తెలంగాణ రైతాంగం సైతం ఏటా సుమారు రూ.లక్ష కోట్ల మేర నష్టాన్ని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు.

అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్నప్పటికీ, రైతుల సమస్యలకు తగిన పరిష్కారం లభించడం లేదన్నారు.దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని శ్రీనివాసులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఆర్. శ్రీనివాస్, వర్ధన్ పర్వతాలు, అంతటి కాశన్న, గుంపల్లి అశోక్, పొదిల రామయ్య, నాగపురి మధు, ఏ. కాశన్న తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జాతీయస్థాయి ఆర్చరీ పోటీల

నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

డిసెంబర్ 17 నుంచి 20 వరకు సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో నాలుగు రోజుల పాటు పోటీలు

హోటళ్లలో త్రాగునీరు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి

ప్రతి హోటల్‌కు ఒక లైజన్ అధికారిని నియమించి సమన్వయం చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం నవంబర్ 09(ప్రజా కలం న్యూస్)

స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో డిసెంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో ఖేలో ఇండియా పోటీల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖేలో ఇండియా జాతీయస్థాయి ఆర్చరీ పోటీల నిర్వహణపై ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. జాతీయస్థాయి పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు, సహాయక సిబ్బంది, సాంకేతిక నిపుణులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

పోటీ కోసం మొత్తం 134 మంది జిల్లాకు వస్తున్నారని ఇందులో 64 మంది క్రీడాకారులు, 20 మంది సహాయక సిబ్బంది, 20 మంది సాంకేతిక సిబ్బంది, 24 మంది క్రీడా వాలంటీర్లు, ఇతరులు ఉంటారని తెలిపారు. వీరికి అవసరమైన వసతి సదుపాయాల కోసం చెక్‌లిస్ట్ ప్రకారం మొత్తం 74 గదులను ముందస్తుగా బుక్ చేయాలని ఆదేశించారు. క్రీడాకారులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా 22 వాహనాలను ఏర్పాటు చేయాలని, వాహనాలు, హోటళ్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.లిస్టేడియంలో, ప్రతి హోటల్‌లో త్రాగునీరు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి హోటల్‌కు ఒక లైజన్ అధికారిని నియమించి, సంబంధిత హోటల్ యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. పోటీలు జరిగే సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియానికి చేరుకునే రహదారులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. క్రీడా శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పోటీల సమయంలో క్రీడాకారులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, సమీప ఆసుపత్రుల్లో అవసరమైన పడకలను ముందుగానే రిజర్వ్ చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది, అవసరమైన వైద్య నదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు డిసిపి రామానుజం, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఆర్టీఓ జగదీష్, ఫైర్ అధికారి బి.అజయ్ కుమార్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ వి. రంజిత్, అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో ఘనంగా దీపావళి సంబరాలు



(వరంగల్/ పర్వతగిరి) నవంబర్ 09, ప్రజాకలం ప్రతినిధి:

చీకట్లను చీల్చుకుంటూ వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగను పురస్కరించుకొని, పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు పటేల్ ఎలేంద్ర నవీన్ స్వగృహంతో పాటు మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్లలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగను మరింత ఆనందంగా జరుపుకునేలా పండుగ వాతావరణాన్ని కల్పించారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారం కావడం వారి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సొంతింటి గడపలో దీపాలు వెలిగించుకోవడం, కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడం తమ జీవితాల్లో మరచిపోలేని అనుభూతి అని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. దీపావళి అంటే కేవలం దీపాల పండుగ మాత్రమే కాదని, పేదల జీవితాల్లో చీకట్లను తొలగించి ఆశలు, ఆనందాలు నింపే పండుగ అని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పిందన్నారు. పేద కుటుంబాల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే ప్రజా ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిజమైన సార్థకత అని అన్నారు. మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంతో సొంతింటి కల నెరవేరిన కుటుంబాల్లో పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. అనంతరం పర్వతగిరి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, పర్వతగిరి మండల అధ్యక్షురాలు సావిత్రి, కల్లెడ ప్యాక్స్ చైర్మన్ అనిల్ రావు, చౌటపల్లి ప్యాక్స్ చైర్మన్ అత్తి కుమారస్వామి, సర్పంచ్ చిదురు శంకర్, గ్రామశాఖ అధ్యక్షులు సంతోష్, మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు, సీనియర్ నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి, సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడలో ఘనంగా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం:
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్

మరిపెడ, ప్రజా కలం న్యూస్ నవంబర్ 9:

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రాంచందర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు వారి వెంట మరిపెడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు



చేపడుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గూగులోత్ రవి టౌన్ అధ్యక్షులు రామ్లాల్ మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

బూర్గంపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్
వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి
గైనకాలజిస్ట్ ప్రతిరోజూ అందుబాటులో ఉండాలి : పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాకలం ప్రతినిధి బూర్గంపాడు, నవంబర్ 09:

బూర్గంపాడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. గైనకాలజిస్ట్ రోజు విడిచి రోజు విధులకు హాజరవుతున్నారని మెడికల్ అధికారి వివరించడంతో, వెంటనే డీసీహెచ్ఎస్‌కు ఫోన్ చేసి గైనకాలజిస్ట్ ప్రతిరోజూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, మహిళా రోగులకు వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

అనంతరం రక్త పరీక్షల కేంద్రాన్ని పరిశీలించి రోజువారీ పరీక్షల సంఖ్య, అందుబాటులో ఉన్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి రోగితో గౌరవప్రదంగా వ్యవహరించాలని, అత్యవసర వైద్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వార్డులు, మరుగుదొడ్లు, రోగులు వేచి ఉండే ప్రదేశాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలోని విద్యుత్ మీటర్ వద్ద వైర్లు బయటకు వచ్చి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి వాటిని సరిచేయాలని, రోగులు, సిబ్బందికి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. రోగులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, వంట తయారీలో పరిశుభ్రత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో మందుల లభ్యత, ఇతర సమస్యలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌పేషెంట్ వార్డులో 15 మంది రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్ల సంఖ్యకు సంబంధించిన వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని గమనించి కాంట్రాక్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు. తగినంత మంది కార్మికులను నియమించి పనులను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, వైద్యులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్‌కర్నూల్ నవంబర్ 09 (ప్రజాకలం) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 23 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు.ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన వివరాలను బాధితులకు తప్పనిసరిగా తెలియజేయాలని స్పష్టం చేశారు.తమ శాఖ పరిధిలో లేని ఫిర్యాదులను సంబంధిత శాఖలకు బదిలీ చేసి పరిష్కారమయ్యేలా చూడాలని, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, జిల్లా మంత్రి కార్యాలయాల నుంచి వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్-2026లో భాగంగా ఏఎస్డీడీ ఓటర్లకు మరో అవకాశం

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సమావేశం

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 09:

మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి శ్రీమతి జె.ఎల్.బి. హరిప్రియ జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్-2026 పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశానికి జడ్చర్ల, బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట్, మిడ్జిల్ మండలాల తహసీల్దార్లు, జడ్చర్ల అదనపు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు ఉర్కొండ, రాజాపూర్, మిడ్జిల్, నవాబ్‌పేట్ మండలాల ఎంపీడీవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గారు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏఎస్డీడీ కేటగిరీల కింద గుర్తించబడిన కారణంగా పేర్లు చోటు చేసుకోని ఓటర్లకు, తగిన పరిశీలన అనంతరం తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను చేర్చుకునేందుకు మరో అవకాశం కల్పించినట్లు తెలిపారు.ఈ మేరకు ఏఎస్డీడీ జాబితాను మరోసారి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి, అర్హులైన



ఓటర్లను గుర్తించి వారి వివరాలను పరిశీలించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా సంబంధిత బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ, అర్హులైన ఓటర్లు అవసరమైన పత్రాలతో క్లెయిమ్‌లు సమర్పించేలా సహకరించాలని కోరారు. అదేవిధంగా, ఈ అవకాశంపై ఎన్నికల అధికారులు మరియు రాజకీయ పార్టీలు తమ తమ స్థాయిల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరికి సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఎస్ఐఆర్-2026లో భాగంగా అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార పురోగతిని, ఏఎస్డీడీ ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియను సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి, క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తుది ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా
ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల రక్తదాన శిబిరం

27వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె.. సమ్మె శిబిరం నుంచే సామాజిక సేవ



నాగర్‌కర్నూల్ నవంబర్ 09 (ప్రజా కలం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 27 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తూ ఉద్యోగులు, మరోవైపు సామాజిక బాధ్యతగా రక్తదానం చేశారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం వైద్య సేవలు అందించే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, సమ్మెలో ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న రోగులకు తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజారోగ్య రంగంలో కీలక సేవలు అందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను చర్చలకు ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. చర్చల ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్లకుమార్ తదితరనాయకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

జజ్జులరావుపేట ప్రజలకు సేవా కానుక

- సొంత ఖర్చులతో స్మశాన రథం, వాటర్ ట్యాంకర్ అందజేత!
- ప్రారంభించిన ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి
- ప్రజా సేవలో ఆదర్శంగా నిలిచిన మాజీ సర్పంచ్ మందడి పద్మ వెంకటరెడ్డి దంపతులు.



పాలేరు నవంబర్ 09
(ప్రజా కలం న్యూస్)

పదవులు ఉన్నా.. లేకున్నా.. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉంటేనే నిజమైన నాయకత్వానికి అర్థం ఉంటుందని మాజీ సర్పంచ్ మందడి పద్మ వెంకటరెడ్డి దంపతులు నిరూపించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, తమ సొంత ఖర్చులతో స్మశాన రథం, వాటర్ ట్యాంకర్‌ను సమకూర్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సేవా కార్యక్రమాలను ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుంబూరి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రజాప్రతినిధిగా పదవిలో ఉన్న సమయంలోనే కాకుండా, పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ప్రజల అవసరాలను గుర్తించి సేవ చేయడం గొప్ప విషయమని అన్నారు. మందడి పద్మ వెంకటరెడ్డి దంపతులు తమ సొంత ఖర్చులతో గ్రామానికి స్మశాన రథం, వాటర్ ట్యాంకర్ అందించడం అభినందనీయమని, వారి సేవా దృక్పథం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ భీమ్ రెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, కంచర్ల జీవన్ రెడ్డి, చాట్ల పరశురాం, శ్యాంసుందర్ రెడ్డి, బాణోత్ రవి ,మాజీ ఎంపీటీసీ వాకా సుధారాణి, లోక్య తండ సర్పంచులు వడిత్య వెంకటేష్ నాయక్, బానోత్ నాగేశ్వరరావు , దాట్ల సతీష్, జజ్జులరావుపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కలకొండ పున్నయ్య, గ్రామ ఉపసర్పంచ్ గంగా భవాని, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చర్ల గార్లపాడులో దీపావళి వెలుగులు :సర్పంచ్ జి. రాముడు

గద్వాల ప్రతినిధి, నవంబర్ 9 (ప్రజా కలం)

దీపావళి పండుగను పురస్కరించుకొని మల్దకల్ మండల పరిధిలోని చర్ల గార్లపాడు గ్రామంలో ఆదివారం సర్పంచ్ జి. రాముడు ప్రత్యేక చొరవ తీసుకొని పారిశుద్ధ్య పనులు, వీధి దీపాల ఏర్పాటు చేపట్టారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో, గ్రామ పెద్దల సమక్షంలో సర్పంచ్ తన సొంత ఖర్చులతో రహదారులపై పేరుకుపోయిన మురికిని డోజర్ సహాయంతో తొలగించి శుభ్రం చేయించారు. అలాగే గ్రామంలోని వీధివీధికి వీధి దీపాలు ఏర్పాటు చేసి దీపావళి పండుగ వేళ గ్రామమంతా వెలుగులు నింపారు. ఈ సందర్భంగా సర్పంచ్ జి. రాముడు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో పాటు గ్రామ పెద్దలు, ప్రజల తోడ్పాటుతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని అన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.





తండ్రి బాటలో వంగవీటి రాధా



విజయవాడ : విజయవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు కార్పొరేటర్‌గా మొదలైన ఆ కుటుంబ రాజకీయ ప్రస్థానం.. ఎమ్మెల్యే పదవి మీదుగా ఇప్పుడు నగర మేయర్ పీఠం వరకు చేరింది. తండ్రి వంగవీటి మోహన రంగా రాజకీయాల్లో సంపాదించుకున్న గుర్తింపును కొనసాగిస్తూ ఆయన కుమారుడు వంగవీటి రాధాకృష్ణ మరో కీలక విజయాన్ని అందుకున్నారు. 25 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. ఇప్పుడు 47 ఏళ్లకు విజయవాడ మేయర్ ఎన్నికల్లో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధా.. వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిపై 1,30,912 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి ఏబీ వెంకటేశ్వరరావుకు 12,642 ఓట్లు వచ్చాయి.వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లోకి రావడానికి ముందే ఆయన కుటుంబానికి విజయవాడలో బలమైన రాజకీయ పునాది ఉంది. తండ్రి మోహన రంగా 1985లో విజయవాడ తూర్పు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన హత్య అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన తల్లి రత్నకుమారి కూడా అదే నియోజకవర్గం నుంచి 1989, 1994 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు.అయితే 1999 ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. టీడీపీలో చేరిన రత్నకుమారికి ఆ ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. ఆమె స్థానంలో బరిలోకి దిగిన సినీ నటుడు కోట శ్రీనివాసరావు విజయం సాధించారు. ఈ పరిణామాల తర్వాత వంగవీటి కుటుంబ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించేందుకు రాధాకృష్ణ సిద్ధమయ్యారు.2003 చివర్లో రాధాకృష్ణ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. డిసెంబర్ 26న మోహన రంగా వర్ధంతి సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సభలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దాసరి నారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మరుసటి ఏడాదే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి పోటీ చేసి గెలిచారు. అప్పటికి ఆయన వయసు కేవలం 25 ఏళ్లు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టడం రాధాకృష్ణ రాజకీయ జీవితంలో తొలి పెద్ద మైలురాయిగా నిలిచింది.ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాధాకృష్ణ రాజకీయ ప్రయాణం ఒకే పార్టీలో సాగలేదు. 2008లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేసినా విజయం దక్కలేదు. తర్వాత 2012లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి మరోసారి అదృష్టం పరీక్షించుకున్నప్పటికీ ఓటమి ఎదురైంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ఆయన.. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటూ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. 2024 ఎన్నికల సమయంలోనూ కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కవచ్చని, మంత్రి పదవి కూడా రావచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. కానీ చివరకు ఆయన రాజకీయ ప్రయాణం మరో మలుపు తిరిగిందిటీడీపీలో సుమారు ఏడేళ్లు కొనసాగిన రాధాకృష్ణ.. విజయవాడ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా మేయర్ ఎన్నికల్లో పోటీకి దిగారు. ఈసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి వచ్చిన ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్యేగా మొదలైన ఆయన ఎన్నికల ప్రస్థానంలో మరో కీలక ఘట్టం చేరింది.వంగవీటి కుటుంబానికి విజయవాడ నగర రాజకీయాలతో ఉన్న అనుబంధం ఈ విజయంతో మరోసారి తెరపైకి వచ్చింది. 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో మోహన రంగా కృష్ణలంకలోని 40వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచారు. అప్పటికి ఆయన ఓ హత్య కేసులో జైలులో ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించడం అప్పట్లో ప్రత్యేకంగా నిలిచింది. కార్పొరేటర్‌గా మొదలైన మోహన రంగా రాజకీయ ప్రస్థానం తర్వాత ఎమ్మెల్యే స్థాయికి చేరింది. ఇప్పుడు అదే నగరంలో ఆయన కుమారుడు మేయర్ ఎన్నికల్లో గెలుపొందారు. తండ్రి నగర కార్పొరేటర్‌గా పనిచేసిన చోట కుమారుడు మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ఈ కథనంలో మరో ఆసక్తికరమైన అంశం.1979లో కృష్ణా జిల్లా పెనమలూరులో జన్మించిన రాధాకృష్ణ.. గుంటూరులో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం తమిళనాడులోని సేలంలో వినాయక మిషన్స్ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివేందుకు చేరారు. అయితే వైద్య విద్యను మధ్యలోనే వదిలేసి రాజకీయాల వైపు అడుగులు వేశారు. అలా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం ఇప్పుడు విజయవాడ మేయర్ ఎన్నికల్లో విజయంతో మరో మైలురాయిని చేరుకుంది.

ఏపీలో మరో నేషనల్ హైవే విస్తరణ

కడప టు రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే

కడప : ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హైవేలు, రోడ్లపై కేంద్రం ఫోకస్ పెట్టింది.. కేంద్రం సహకారంతో హైవే విస్తరణ ప్రాజెక్టుల్ని చేపట్టారు. కడప టు చెన్నై హైవేలో కొన్నేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు దాదాపు 50 కిలోమీటర్ల రోడ్డు దెబ్బతింది. శేషాచలం అడవి, ప్రమాదకర మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరిగేవి. అందుకే కడప టు చెన్నై హైవేను రెండు వరసలు నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని ఐదేళ్ల క్రితం నిర్ణయించింది. అయితే పనులు మాత్రం ప్రారంభంకాలేదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎన్‌హెచ్-716లో కడప-రేణిగుంట సెక్షన్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. మొత్తం122 కిలోమీటర్లకు గాను అంచనా వ్యయం రూ. 2,254 కోట్లుగా ఉంది.కేంద్రం నేషనల్ హైవే 716కి అనుసంధానంగా కడప నుంచి రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ప్లాన్ చేసింది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ తగ్గించొచ్చని భావించారు. కడప, భాకరాపేట, ఒంటిమిట్ట, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, మామండూరు మీదుగా రేణిగుంట వరకు నాలుగు లైన్లుగా హైవేను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ రోడ్డులో కడప నుంచి రేణిగుంట వెళ్లేందుకు నాలుగు గంటల సమయం పడుతోంది. ఈ హైవే విస్తరణ పూర్తయితే కేవలం రెండు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. అలాగే వాహనాల రద్దీ తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అలాగే ప్రజా రవాణాతో పాటుగా వ్యవసాయ, వాణిజ్య రంగాలకు ఉపయోగంగా ఉంటుందంటున్నరు.2021లోనే కేంద్రం ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. 2024 వరకు అసలు పనులు ప్రారంభించలేదు. కేంద్రంతో సంప్రదింపులు జరపకపోవడంతో పాటుగా అటవీశాఖ అనుమతులు రావడంలేదన్న కారణాలతో పనులు పక్కన పెట్టారు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 అక్టోబరులో పనులు ప్రారంభించారు.. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలన్న టార్గెట్ పెట్టుకున్నారు. అటవీ శాఖ అనుమతులతో పాటుగా నిధుల విడుదల, భూసేకరణ, పరిహారం పంపిణీ పూర్తి చేశారు. ప్రస్తుతం కడప జిల్లాలో పనులు స్పీడ్ అందుకున్నాయి.

అలాగే రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ భూమిలో చెట్ల తొలగింపు కొనసాగుతోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే తిరుపతి, చెన్నై వెళ్లేవారికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

కడప నుంచి రేణిగుంటకు.. అక్కడి నుంచి తిరుపతికి రెండున్నర గంటల్లోనే వెళ్లొచ్చన్నారు. మొత్తానికి 2027 నాటికి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్ని పూర్తి చే?యలనే లక్ష్యంతో పనుల్ని మరింత వేగవంతం చేశారు.

గుమ్మడి సంధ్యారాణికి డేంజర్ బెల్స్

విజయనగరం : మంత్రిగా ఉండి కూటమి ఆదేశాలను ధిక్కరించడం ఈ ఎన్నికల్లో హైలెట్ అనే చెప్పాలి. కూటమి నిర్ణయించిన అభ్యర్థులను కాకుండా తన సొంత అనుచరులకు పదవులను కట్టబెట్టాలన్న మంత్రిగారి తపన కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీకి తలనొప్పిగా మారింది. గుమ్మడి సంధ్యారాణి వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి పొత్తును ధిక్కరించడంతో పాటు తమ అనుచరులను రెబల్ గా దించి ఏదో సాధిద్దామని భావించి చతికలపడుతున్నారు.ఇక విషయానికి వస్తే కూటమి పొత్తుని దిక్కరించి, రాష్ట్ర స్తాయి సర్దుబాటులో జనసేనకి ఇచ్చిన సాలూరు మున్సిపాలిటీని జనసేనకి వదలకుండా టీడీపీ నుండి రెబల్‌ని దింపి, ప్రచారం కూడాచేసారు. ఎక్కడా పొత్తు దర్మాన్ని పాటించకుండా వార్డుల్లో కూడా జనసేన మీద పోటీ పెట్టారు. ఇది గుమ్మడి సంధ్యారాణికి అవమానంగానే చూడాలి. తొలిసారి ఎమ్మెల్యే అయి, తొలిసారి మంత్రి పదవి లక్కుతో పొంది పార్టీ నాయకత్వం ఆదేశాలను ధిక్కరించడాన్ని పలువురు మిత్ర పక్ష పార్టీ నేతలు తప్పుపడు తున్నారు సాలూరు నియోజకవర్గానికి గుమ్మడి సంధ్యారాణి తొలిసారి గెలిచారు. ఒకరకంగా చెప్పాలంటే సాలూరు నియోజకవర్గంలో టీడీపీకి పట్టులేదు. కూటమి హవాలో గెలిచారు. గతంలో రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలయిన గుమ్మడి సంధ్యారాణి గాలి వాటంలో గెలిచారు. తనకున్న సామాజికవర్గం కారణంగా ఎమ్మెల్సీ పదవిని అంతకు ముందు పొందారు. టీడీపీకి నమ్మకమైన నేతగా నిలిచినప్పటికీ గుమ్మడి సంధ్యారాణి మున్సిపల్ ఎన్నికల్లో సాలూరు మున్సిపాలిటీలో రెబల్ ను బరిలోకి దించి తమ పార్టీ నేతలకే సవాల్ విసిరారు. కానీ మంత్రి గారి చర్యలను కూటమి పార్టీల కార్యకర్తలు సమర్థించలేదు. కూటమిలో పొత్తులో భాగంగా అది జనసేనకు కేటాయించారు. కానీ తన అనుచరుడి కోసం రెబల్ గా దించి తప్పు చేశారంటూ సొంత పార్టీ నేతలే మంత్రిగారి మీద కారాలు, మిరి?యలు నూరుతున్నారు. మరొకవైపు జనసేన నేతలు కూడా ఇప్పటకే మంత్రి గుమ్మడి సంధ్యారాణిపై తమ పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు.... అయితే జనసేన అభ్యర్థి గెలవడంతో ఇక గుమ్మడి సంధ్యారాణి సీన్ చెప్పకనే తెలిసిపోయిం దంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికలతో ఊరుకోని గుమ్మడి సంధ్యారాణి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ తన మద్దతుదారులను రెబల్ గా బరిలోకి దింపారు. జనసేన కు దక్కాల్సిన వాటాను తాము దక్కించుకుని క్రెడిట్ కొట్టేయాలనుకున్న మంత్రి గారి ఆలోచన రివర్స్ అయిందనే అనుకోవాలి.కూటమి లోని టీడీపీ నాయకత్వం కూడా గుమ్మడి సంధ్యారాణిపై చర్యలు తీసుకోకపోవడం ఒకింత జనసైనికులకు ఆగ్రహాన్ని తెప్పించింది. సాలూరులోవరసగా కాంగ్రెస్, వైసీపీలు మూడు ఎన్నికల్లో గెలిచాయి. కానీ మొన్న గాలివాటాన గెలిచిన గుమ్మడి సంధ్యారాణి మాత్రం తాను ఏదో పెద్ద లీడర్ అని పోజులివ్వడం మాత్రం సొంత పార్టీ నేతలకే నచ్చడం లేదు.ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే గుమ్మడికి మంత్రి పదవి ఊడటం ఖాయమన్న కామెంట్స్ కూటమి పార్టీల నేతల నుంచి వినిపిస్తుంది.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...

నెల్లూరు : రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్‌పై పట్టు సాధించారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మేయర్‌గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి పై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి.నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి , పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పార్టీకి అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్ యాదవ్‌తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం , వెంకటగిరి , సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించడం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం, పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తుఫాన్ సహాయక చర్యలను రైతులకు వివరించిన సీఎం చంద్రబాబు

గుంటూరు : అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వచ్చింది. తుఫాన్ల వల్ల పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ల వల్ల రైతులు నష్టపోయారు.ఎల్ నినో వల్ల రైతులు గడ్డు పరిస్థితుల్లో ఉంటే... పట్టిసీమ ద్వారా నీళ్లందిస్తే రైతులు పంట వేసుకున్నారు. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుఫాన్ రైతులను దెబ్బతీసింది. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో చాలా వరకు నష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అయన రేటూరు దగ్గర రైతులను ఉద్దేశించి మాట్లాడారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలను మురసు తుఫాన్ బాగా ఇబ్బంది పెట్టింది.ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం.పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీతో నష్ట పోయిన పెట్టుబడిని రైతులు దక్కించుకోవచ్చు. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు చేస్తే ఎవ్వరూ తేలిగ్గా తీసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ముందస్తు చర్యలతోనే చాలా వరకు ఆస్తి నష్టాన్ని తగ్గించి.. సహాయక చర్యలు వేగంగా చేపట్టగలిగామని అన్నారు. తుఫాన్ సహాయ చర్యల కోసం తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు నుంచి సాయం తీసుకుంటున్నాం. అర్నబ్ తుఫాన్ వల్ల నేల కొరిగిన 30 వేల విద్యుత్ స్థంభాలను పునరుద్దరించగలిగాం. మురసు తుఫాన్ వల్ల కూడా మరో 10 వేల విద్యుత్ స్థంభాలు దెబ్బతిన్నాయి. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్దరిస్తున్నాం. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల సంభవించిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నాం. తుఫాన్ల ప్రభావితంపై కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాం. తుఫాన్ల ప్రభావంపై ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందేంత వరకు పని చేస్తామని అన్నారు.నల్లమడ డ్రైన్ కు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. గత పాలనలో తుఫాన్లు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి...పరామర్శించారు.

ఎన్నికల కంటే.. ప్రజా సమస్యలే ముఖ్యంగా భావించి తుఫాన్ల సమయంలో పనిచేశాం కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బందిగా పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక.. అన్ని విషయాలు మాట్లాడతాం.తీర ప్రాంతాలను తుఫాన్లు దెబ్బతీస్తే... రాయలసీమ ప్రాంతాన్ని ఎల్ నినో ఇబ్బంది పెట్టింది. రాయలసీమలో కూడా కరువును అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించాయి. తీర ప్రాంతంలో నీళ్లు వృధాగా సముద్రంలోకి పోతుంటే... రాయలసీమ ప్రాంతం నీటి కొరతను ఎదుర్కొంటోంది.అందుకే నీటి భద్రతకు.. సమర్ధ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

డిప్యూటీ మేయర్... బీజేపీ వర్సెస్ జనసేన

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం కు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కావడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అద్భుతమైన ఫలితాలు సాధించడంతో ఇప్పుడు పదవుల పంపకాలపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కుతుందన్నది మూడు పార్టీల్లోనూ ఉత్కంఠ రేపుతోంది.విశాఖలో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి బలమైన పట్టు ఉంది. భారతీయ జనతా పార్టీకి కూడా కొన్ని ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉండగా, జనసేనకు సామాజిక సమీకరణల పరంగా ఓటు బ్యాంకు ఉంది. ఈ మూడు పార్టీల బలాలు కలవడంతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 120 వార్డులకు గాను 98 స్థానాలను అధికారిక కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారు. మరో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించినప్పటికీ, వారు కూటమికి చెందిన రెబల్స్ కావడం గమనార్హం. దీంతో కూటమి వైపు మొత్తం 106 మంది కార్పొరేటర్ల మద్దతు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైసీపీ 13 స్థానాలతో ప్రతిపక్షంలో ఉండనుండగా, సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకుంది.మేయర్ పదవి టీడీపీకి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానంపై బీజేపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. విశాఖలో తమకున్న రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మేయర్ పదవిని ఇవ్వాలని బీజేపీ గతంలోనే కోరినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో ఎంపీ స్థానం కూడా కేటాయించకపోవడంతో కనీసం డిప్యూటీ మేయర్ పదవైనా ఇవ్వాలని టీడీపీ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలోనే విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు కార్పొరేటర్‌గా పోటీ చేశారని, ఆయనకు డిప్యూటీ మేయర్ అవకాశం కల్పిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆయన పేరు ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా ఈ పదవి తమ పార్టీకి దక్కేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.మరోవైపు జనసేన కూడా డిప్యూటీ మేయర్ పదవిపై ఆశలు పెట్టుకుంది. విశాఖలో 26 మంది కార్పొరేటర్లతో కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా ఉన్న తమకు ఈ అవకాశం ఇవ్వడం సమంజసమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కేవలం ఎనిమిది మంది కార్పొరేటర్లు ఉన్న బీజేపీకి కాకుండా, తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో ఇచ్చిన రాజకీయ హామీలను పరిగణనలోకి తీసుకుంటే తమకే అవకాశం వస్తుందని బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారు.ఉత్తరాంధ్ర రాజకీయ సమీకరణాలు కూడా ఈ పదవుల పంపకంలో కీలకంగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం, విజయనగరం కార్పొరేషన్లలో టీడీపీకి ప్రాధాన్యత దక్కగా, రాబోయే శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనకు అవకాశం కల్పించే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అవసరమైతే విజయనగరంలో డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గతంలో విశాఖ మేయర్ పదవిని బీజేపీ గెలుచుకున్న చరిత్ర కూడా ఆ పార్టీ నేతలకు గుర్తుంది. ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానం దక్కితే నగర రాజకీయాల్లో తమ ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చని భావిస్తున్నారు. అయితే జనసేన కూడా తన బలాన్ని తక్కువగా అంచనా వేయకూడదని పట్టుబడుతోంది. దీంతో చివరకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ డిప్యూటీ మేయర్ పీఠం బీజేపీకి దక్కుతుందా? లేక జనసేన తన బలంతో ఆ స్థానాన్ని సాధించుకుంటుందా? అన్నది త్వరలో తేలనుంది.

ముక్కా శ్రావణి. తమ కుటుంబం ముప్పై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉందని.. అందుకే తమకు ఈ అవకాశం దక్కిందన్నారు. కూటమి పార్టీల్లో అనుభవం ఉన్న నేతల సహకారంతో విశాఖపట్నాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానన్నారు.ముక్కా శ్రావణి తండ్రి ముత్యాలనాయుడు తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు.. ఆయన గతంలో కార్పొరేటర్‌గా పనిచేశారు. శ్రీవాణి వృత్తిరీత్యా ఫిజియో థెరపిస్ట్ కాగా.. ఆమె రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2015 నుంచి టీడీపీలో యాక్టివ్ అయ్యారు.. 2021 ఎన్నికల్లో 26వ వార్డు (అక్కయ్యపాలెం ప్రాంతం) నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందారు. అలాగే ముక్కా శ్రావణి తన డివిజన్‌లో పనులకు సంబంధించి నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఇటీవల ఆమెకు టికెట్ ప్రకటించిన తర్వాత ఆ వీడియో సోషల్ మీడియాలో మళ్లీ చక్కర్లు కొట్టింది. వైరల్ అయిన వీడియోలో ఏదో ఒకరోజు తమకు టైం వస్తుందన్నారు.. చెప్పినట్లుగానే ఆమె విశాఖ నగరానికి మేయర్ అయ్యారు.అంతేకాదు కూటమి పార్టీల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటుతో కొంత గందరగోళం ఏర్పడింది.

మొత్తం 120 వార్డుల్లో 246మంది స్వతంత్రులు పోటీచే చేశారు. కూటమి పార్టీల్లో కూడా రెబల్స్ పోటీచేసి గెలిచారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 36వ వార్డులో కొల్లి సింహాచలం (జనసేన పార్టీ రెబల్), . అగనంపూడి జోన్ 106 వార్డులో రామునాయుడు (జనసేన పార్టీ రెబల్) గెలుపొందారు. విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం 73వ వార్డులో పెతకంశెట్టి శ్యాం సుధాకర్‌రావు (జనసేన పార్టీ రెబల్). 39, 41 వార్డుల్లో (టీడీపీ రెబల్స్) బత్తిన నవీన్, పంపాన రాజ్యలక్ష్మిలు విజయం సాధించారు. 118 వార్డులో (పెందుర్తి) టీడీపీ రెబల్ గంట్ల లక్ష్మి గెలిచారు.గాజువాక 86 వార్డులో కాకి గోవిందరెడ్డి (టీడీపీ రెబల్) బరిలో విజయాన్ని అందుకున్నారు.

విశాఖపట్నం జీవీఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా.. ఇప్పుడు అందరి దృష్టి డిప్యూటీ మేయర్ పదవివైపు మళ్లింది. ఈ పదవి కూటమిలో ఏ పార్టీకి దక్కుతుందనే చర్చ జరుగుతోంది. డిప్యూటీ మేయర్ రేసులో ప్రధానంగా విశాఖపట్నం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరుశరామరాజు పేరు వినిపిస్తుంగా.. ఆయన 54వ డివిజన్ నుంచి గెలిచారు.

కల్తీపాలు ముఠా గుట్టురట్టు

హైదరాబాద్ : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పాల దందాను మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు బట్టబయలు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న కల్తీ పాల తయారీ కేంద్రంపై నిన్న రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్ట్ చేసి, భారీగా కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు.పోచారం గ్రామానికి చెందిన ఆండే శ్రీశైలం (43) అనే వ్యక్తి తన ఇంట్లోనే రహస్యంగా ఈ కేంద్రాన్ని నడుపుతున్నాడు. పాల పొడిలో నీళ్లు, ప్రమాదకరమైన రసాయనమైన హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను కలిపి సింథటిక్ పాలను తయారు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పక్కా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ బృందం మెరుపుదాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుంది.ఘటనా స్థలం నుంచి 100 లీటర్ల కల్తీ పాలు, 35 కిలోల ‘ధోల్‌పూర్’ బ్రాండ్ పాలపొడి, ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఈ కల్తీ పాలను హైదరాబాద్ నగరంలోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి రసాయనాలు కలపడం ఆరోగ్యానికి ప్రమాదకరం. ఇది క్రిమిసంహారకంగా కొన్ని పారిశ్రామిక, శుభ్రపరిచే అవసరాల్లో ఉపయోగించే రసాయనం. దీన్ని కలిపిన పాలు తాగితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. కడుపులో మంట, నొప్పి, వాంతులు, విరేచనాలు రావచ్చు. అధిక మోతాదులో రసాయనం చేరితే కడుపు, పేగుల లోపలి పొర దెబ్బతినే ప్రమాదం ఉంది. హైడ్రోజన్ పెరాక్సైడ్ మోతాదు, గాఢత ఎక్కువగా ఉంటే అంతర్గత గాయాలు, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. తీవ్రమైన సందర్భాల్లో రక్తనాళాల్లో ఆక్సిజన్ బుడగలు ఏర్పడి రక్తప్రసరణకు ఆటంకం కలిగించే గ్యాస్ ఎంబాలిజం సంభవించవచ్చు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అనుమానాస్పద పాలను తాగడం కంటే అసలు పాలు లేదా టీ తాగకుండా ఉండటమే ఉత్తమం. శ్రీశైలంపై కేసు నమోదు చేసి,

కాంగ్రెస్, బీజేపీ నుంచి తెలంగాణ రక్షణ సేనలో చేరికలు

కొట్టాల యాదగిరి సమక్షంలో పలువురు నాయకులు,కార్యకర్తల చేరిక

గజ్వేల్: 09 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ రక్షణ సేన పార్టీ సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై కాంగ్రెస్,బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలో చేరారు.గజ్వేల్ నియోజకవర్గంలోని కుకునూరుపల్లి మండలం లక్ధారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,మాజీ ఉపసర్పంచ్ కంకణాల మల్లేశం,కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అష్రాఫ్‌తో పాటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్



మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డుకు చెందిన మున్ను,నాలుగో వార్డుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకురాలు శైలజ తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తెలంగాణ రక్షణ సేన నిలుస్తోందని పేర్కొన్నారు.ప్రజలు పార్టీ ఆలోచనలు, విధానాలను గమనిస్తున్నారని తెలిపారు.పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ..తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన పంచజన్య సిద్ధాంతాలు, సామాజిక న్యాయం,బహుజన తెలంగాణ సాధన వంటి అంశాలు తమను ఆకర్షించాయని తెలిపారు. సామాజిక న్యాయ సాధనలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు,ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగని రాజు,లీగల్ సెల్ అధ్యక్షుడు నరేష్ చారి,పాషా,లక్ష్మణ్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్‌కు ఘన సన్మానం

కుమ్మరి కులస్తులకు దేవాలయాల్లో అర్చకులుగా అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

గజ్వేల్, 09 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్‌గా నియమితులైన జాలిగామ ఆనంద్‌ను గజ్వేల్ మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు.మండల అధ్యక్షుడు తోవ్వల యాదగిరి నేతృత్వంలో సంఘం నాయకులు ఆనంద్‌కు శాలువా



కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుమ్మరి కులస్తులకు దేవాలయాల్లో అర్చకులుగా అవకాశం కల్పించడంతోపాటు,వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నాగపురి రమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి యాదగిరి, గజ్వేల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమె స్వామి,మండల గౌరవ అధ్యక్షుడు నాగపురి బాబు, అసోసియేట్ అధ్యక్షుడు బైకాడి పోచయ్య,గౌరవ సలహాదారు కొలిచెలిమె మల్లేశం,మండల ఉపాధ్యక్షులు డాకూరి వీరేశం,కుమ్మరి రాజలింగం,ప్రధాన కార్యదర్శి నాగపురి చందు,ప్రచార కార్యదర్శి కనుగుల విఠల్,యూత్ అధ్యక్షుడు నాగపురి కిషన్,మాజీ అధ్యక్షుడు బాయికాడి యాదగిరి,గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు బోర్ర స్వామి,జాలిగామ కుమ్మరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి బోరు మోటార్ ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ : నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి, త్రాగు నీటి వసతి సౌకర్యాల కల్పనలో భాగంగా 31 వ డివిజన్ దుర్గమ్మగడ్డ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేత పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక కార్పోరేటర్ ముఖద్దర్ హుస్సేన్ అలీతో కలిసి మంచి నీటి బోరు మోటారును అధికారికంగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ...నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో మా పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తత ఎల్ నినో ప్రభావం, రానున్న వేసవి కాలం దృష్ట్యా... నగర ప్రజల త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో ప్రజల త్రాగు నీటి సరఫరా లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రాధాన్యతగా మంచి నీటి వసతి సౌకర్యాలతో పాటు డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి క్రార్యక్రమాల లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వివిధ గ్రాంట్ల ద్వారా ప్రజల మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పనులను ప్రారంభం చేసి శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు.

గాంధీ హాస్పిటల్ మురుగు నీరు రోడ్లపైకి రావడంతో స్థానికులకు సమస్యలు

సికింద్రాబాద్ : లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న గాంధీ హాస్పిటల్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గాంధీ హాస్పిటల్ నుండి వెలువడుతున్న మురుగు నీరు రోడ్లపైకి రావడంతో పాటు దుర్గంధం కారణంగా తాము అనేక అవస్థలు, అనారోగ్యం పాలు అవుతున్నామని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో తలసాని గాంధీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డా. ఉషారాణి, వైద్యులతో పాటు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీఎస్ఎంఐడీసీ శాఖల అధికారులతో కలిసి సమావేశం అయ్యారు. మురుగు నీటి తో పాటు మార్చురీ నుండి వెలువడుతున్న దుర్వాసన కారణంగా గాంధీ హాస్పిటల్ వెనుక వైపు ఉన్న పద్మారావు నగర్, ఎదుర్కొంటున్న సమస్యలపై, తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

మహేశ్వరంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాపాలనలో సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి గుర్తింపు

జిల్లా జనరల్ సెక్రటరీ, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్



మహేశ్వరం, నవంబర్ 09,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజాపాలన కొనసా గిస్తోం దని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుం బాలు, రైతు లు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలి పారు. గృహజ్యోతిలో భాగంగా అర్హులైన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులకు రూ.500కే గ్యాస్ సిలిండర్. అర్హులైన రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ. రైతులకు పెట్టుబడి సాయం అందించడం.సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గృహ నిర్మాణ ఆర్థిక సాయం.రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స సదుపాయం. ఇవే కాకుండా సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, ధాన్యానికి బోనస్, పంటల కొనుగోలు, సామాజిక భద్రతా పింఛన్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూత, మహిళా సంఘాల బలోపేతం వంటి కార్యక్రమాల ను ప్రభుత్వం చేపడుతోందని నాయకులు వివరించారు.అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఉ ద్యోగాల భర్తీ, విద్యారంగంలో నూతన మార్పులు, యంగ్ ఇండియా విద్యా సంస్థల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధా న్యత ఇవ్వడం వంటి కార్యక్ర మాలతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోం దని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోం దని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రట రీ, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు, ఉప్పుగడ్డ తండా సర్పంచ్ నేనావత్ రాజు నాయక్ చిన్నతుప్ర సర్పంచ్ రాజు గొల్లూరి, గంగారం సర్పంచ్ దేవేందర్ నాయక్, శివగంగా దేవాలయ కమిటీ చైర్మన్, అల్లే కుమార్, ఉపసర్పంచ్ సంగారెడ్డి, కాకి ఈశ్వర్, లాజార్, ఏర్పుల శ్రీశైలం, ప్రభు, కాకి మల్లేష్, వెంకటేష్,హరికృష్ణ,రవి నాయక్, గణేష్ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్‌లో నీటి కష్టాలు



హైదరాబాద్ : హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభా వితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరం లోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక పోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమా నులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగు తోంది. హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫ రాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపి స్తోంది. నీరు అందుబాటులో లేక విద్యా ర్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాల యానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజా రావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టళ్లలో ఉ ంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారునీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉ ంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు నరివడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభిం చడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవు తుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నా య ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగిం చడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాఫీ షాపీల్లోనూ ఆఫీసు వర్క్

బెంగళూరు : కాఫీ షాపులను కొందరు తాత్కాలిక ఆఫీసులుగా మార్చుకుంటున్నారు. కస్టమర్లకు ఇది సౌకర్యంగా ఉన్నా కేఫ్ యజమానులకు తలనొప్పిగా మారుతోంది. బెంగళూరులో ఓ కేఫ్ యజమాని ఎదుర్కొంటున్న సమస్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కేవలం రూ. 150 కాఫీ ఆర్డర్ చేసి, గంటల తరబడి టేబుళ్లను ఆక్రమించుకుంటున్న కస్టమర్ల వల్ల వ్యాపారం దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారుబెంగళూరులోని ఇందిరానగర్‌లో ఓ వ్యక్తి రూ 60 నుంచి 70 లక్షలు పెట్టుబడి పెట్టి కెఫె ప్రారంభించారు. వ్యాపారం ప్రారంభించిన కొద్ది రోజులకే ఓ సమస్య ఎదురైంది. అక్కడికి వచ్చే కస్టమర్లు కేవలం రూ. 150 విలువైన ఒక కప్పు కాఫీ మాత్రమే ఆర్డర్ చేస్తున్నారు. ఆ తర్వాత ల్యాప్‌టాప్‌లు తెరిచి గంటల తరబడి అక్కడే కూర్చుంటున్నారు. కొన్నిసార్లు రోజంతా కూడా టేబుళ్లను ఆక్రమించుకుంటున్నారు.కేఫ్‌లోని టేబుళ్లన్నీ ఇలా గంటల తరబడి కస్టమర్లతో నిండిపోవడంతో కొత్తగా వచ్చే వారికి కూర్చోవడానికి స్థలం ఉండటం లేదు. దీంతో చాలా మంది కెఫెలోకి వచ్చి సీట్లు ఖాళీగా లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఒకవైపు కాఫీ ఆర్డర్ చేసిన కస్టమర్లను వెళ్లిపోవాలని చెప్పలేరు. అలా చెబితే వారు గూగుల్‌లో నెగెటివ్ రివ్యూ ఇచ్చే అవకాశం ఉంది. దానివల్ల కెఫెకు నష్టం కలుగుతుం దని యజమాని ఆందోళన చెందుతున్నారు.ప్రముఖ కాఫీ చైన్లు స్టార్‌బక్స్, అఅఆ, థర్డ్ వేవ్ లో కాఫీ, స్నాక్స్ ధరలు ఎక్కువగా ఉంటాయి. కస్టమర్లు కేవలం కాఫీ, స్నాక్స్ కోసమే డబ్బులు చెల్లించడం లేదు అక్కడ కూర్చుని గంటల తరబడి గడిపే సమయానికి పరోక్షంగా చెల్లిస్తున్నారు. కెఫెలో కూర్చునే స్థలానికీ ఓ ధర ఉంటుంది.ఈ పోస్టు వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాల సూచనలు చేస్తున్నారు. కెఫెలో ఎంతసేపు ఉంటే అన్ని గంటలకు కనీసం ఒక కాఫీ ఆర్డర్ చేయాలనే నిబంధన పెట్టాలని ఓ నెటిజన్ సూచించారు.

కాఫీ అమ్మడం కంటే కెఫెలో గడిపే సమయానికి డబ్బులు వసూలు చేసే విధానాన్ని తీసుకురావాలి. ఎక్కువ ధర చెల్లిస్తే మెరుగైన సీటింగ్, కాఫీ, స్నాక్స్ అందించవచ్చు అని మరికొందరు అన్నారు. కొన్ని కేఫెలలో ల్యాప్‌టాప్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. కస్టమర్లు చేసే ఖర్చును బట్టి కెఫెలో ఉండే సమయాన్ని నిర్ణయించాలి. రూ. 150 నుంచి రూ. 750 వరకు బిల్లు ఉంటే గరిష్ఠంగా గంటన్నర, రూ. 750 నుంచి రూ 1,500 వరకు బిల్లు ఉంటే రెండు గంటల సమయం ఇవ్వొచ్చు. వారంలో ఉదయం వేళల్లో ల్యాప్‌టాప్‌లతో పని చేసేందుకు అనుమతించి, సాయంత్రాలు, వారాంతాల్లో మాత్రం ఆంక్షలు విధించాలని మరో నెటిజన్ సూచించారు.

ఐరన్ స్పాంజ్ పరిశ్రమను వెంటనే మూసి వేయించాలి

బషీర్ బాగ్ : తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతూ కాలుష్యాన్ని వెదజల్లే ఐరన్ స్పాంజ్ పరిశ్రమను వెంటనే మూసియేయించండి.తమ పంట పొలాలను తాగు నీరును కలుషితం చేస్తూ.. తమ పాడి పశువుల చావుకు.. తమ అనారోగ్యాలకు కారణమవుతున్న ఓం శివ శక్తి కేడియా ఐరన్ స్పాంజ్ పరిశ్రమ వెదజల్లే కాలుష్యం నుండి తమను కాపాడాలంటూ ఆ గ్రామస్తులు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కందివనం మరియు మొగలిగిద్ద గ్రామ శివార్లలో గల ఓం శివ శక్తి కేడియా ఐరన్ స్పాంజ్ పరిశ్రమ నుండి వెలువడుతున్న కాలుష్యం కారణంగా తమ పచ్చని పంట పొలాలు మరియు తాగునీరు కలుషితమవడమే కాకుండా.. ఆ పరిశ్రమ వదిలే కాలుష్యపు నీరు చుట్టుపక్కల గల చెరువులలో వెళ్లి కలవడం వల్ల తాగునీరు కలుషితమై తాము అనారోగ్యాల పాలవుతున్నామని.. తమ పాడిపశులు మృత్యువాత పడుతున్నాయని.. ఆ పరిశ్రమ చుట్టుపక్కల గల గ్రామస్తులందరూ పరిశ్రమ ముందు టెంట్ వేసుకొని ఆందోళనకు దిగినారు. ముఖ్యంగా పరిశ్రమ వదిలే పొగ వల్ల పరిశ్రమ చుట్టూ ఉన్న పంట పొలాలు కలుషితమవడమే కాకుండా.. కొన్ని కిలోమీటర్ల మేర పంట పొలాలపై నల్లటి దుమ్ము కమ్ముకొని దిగుబడి రావడం లేదని..తాము అనారోగ్యాల పాలవుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ముఖ్యంగా ఆ పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కూడా ఆ పరిశ్రమ వదిలే పొగ వల్ల నల్లటి దుమ్ము పేరుకుపోవడంతో విద్యార్థులు కూడా అనారోగ్యాల పాలవుతున్నారని.. పై విషయాన్ని తాము ప్రభుత్వ యంత్రాంగానికి.. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు ఫిర్యాదు చేసిన అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని.. గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గాంధీ హాస్పిటల్ మురుగు నీరు రోడ్లపైకి రావడంతో స్థానికులకు సమస్యలు

సికింద్రాబాద్ : లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న గాంధీ హాస్పిటల్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గాంధీ హాస్పిటల్ నుండి వెలువడుతున్న మురుగు నీరు రోడ్లపైకి రావడంతో పాటు దుర్గంధం కారణంగా తాము అనేక అవస్థలు, అనారోగ్యం పాలు అవుతున్నామని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో తలసాని గాంధీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డా. ఉషారాణి, వైద్యులతో పాటు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీఎస్ఎంఐడీసీ శాఖల అధికారులతో కలిసి సమావేశం అయ్యారు. మురుగు నీటి తో పాటు మార్చురీ నుండి వెలువడుతున్న దుర్వాసన కారణంగా గాంధీ హాస్పిటల్ వెనుక వైపు ఉన్న పద్మారావు నగర్, ఎదుర్కొంటున్న సమస్యలపై, తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

కనిపించని అధికార పార్టీ ప్రభావం



వరంగల్: వచ్చే ఏడాది మార్చిలో జరగను న్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపు తున్నాయి. వరంగల్-ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి- హైదరా బాద్ నియోజక వర్గాలను కైవసం చేసుకో వడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం- నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియ లో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబ డినట్లు వార్తలు అందుతున్నాయి.ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అఖా స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉ న్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాం శమయ్యాయి.ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, వట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉ ంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉ న్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధి స్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

గిన్నిస్ రికార్డు సాధించిన చిన్నారికి సన్మానం

బింగి శర్వాణిని అభినందించిన సోము రమేష్ కురుమ

బీబీనగర్,నవంబర్ 09 (ప్రజాకలం): తైక్వాండో క్రీడలో ప్రతిభ చాటి గిన్నిస్ ప్రపంచ రికార్డు ఘనతలో భాగస్వామిగా నిలిచిన మక్త అనంతారం గ్రామానికి చెందిన చిన్నారి బింగి శర్వాణిని ఆదివారం గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ ఘనంగా సన్మానించి అభినందించారు. బింగి ఐలయ్య యాదవ్, మహేశ్వరి దంపతుల కుమార్తె శర్వాణి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆగస్టు 9న నిర్వహించిన ప్రపంచంలోనే



అతిపెద్ద తైక్వాండో పాఠంలో పాల్గొంది. ఈ కార్యక్రమంలో 533 మంది పాల్గొని గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇందులో శర్వాణి కూడా పాల్గొని సర్టిఫికెట్ అందుకుంది. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొని గ్రామానికి గుర్తింపు తేవడం గర్వకారణమని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్, గంగపుత్ర సంఘం మాజీ అధ్యక్షుడు పూస జాంగిర్, యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు జంగా మహేష్ యాదవ్, మాజీ నీటి సంఘం చైర్మన్ కసిరెడ్డి పెద్దనారంరెడ్డి, తైక్వాండో మాస్టర్ గ్యార నాగరాజు, బింగి ఐలయ్య యాదవ్, సిలువేరు భానుప్రసాద్, బర్ల ఐలయ్య ముదిరాజ్, బత్తిని లక్ష్మయ్య గౌడ్, కొమ్మిరి రమేష్ యాదవ్, యాకరి స్వామి తదితరులు పాల్గొన్నారు.



రాయపోల్‌లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 09.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 57వ జన్మదిన వేడుకలను ఆదివారం రాయపోల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాల రామగౌడ్, ఉషనగల్ల స్వామి, రాష్ట్ర మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ఇక్బాల్, సర్పంచులు అశోక్ రెడ్డి, రామారం స్వామి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఇప్ప మల్లేశం, బాకీ మల్లేశం, పట్నం యాదగిరి, మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్, మాజీ ఎంపీటీసీ స్వామి, అప్సర్, గోపాల్, రఘుపతి, నరసింహులు, బాబు, మహేష్, నర్సింగరావు, నర్సింలు, ఎల్లం చందు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కందుకూరులో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

కందుకూరు మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి

కందుకూరు, నవంబర్ 09, (ప్రజా కలం)

కందుకూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్




పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొక్క జంగారెడ్డి కందుకూరు గ్రామ సర్పంచ్ సరికొండ పాండు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుని వేడుకలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో, మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, అధ్యక్షులు సరికొండ జగన్, వార్డ్ మెంబర్లు మోటి రమేష్, కందరి నరసింహ, జంగా చారి, మండల అధ్యక్షులు గాదె కుమార్, కందుకూరు గ్రామ అధ్యక్షులు పాముల కృష్ణ, ఏఎంసి డైరెక్టర్ సురేందర్, నిరంజన్, గాండ్ల నవీన్, శ్రీనివాస్ గౌడ్, ఎడ్ల మహేందర్, జైద్వారం మహేందర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు భరోసా..

రైల్వే విస్తరణ బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే గాంధీ..

పటాన్‌చెరు, నవంబర్ 9 (ప్రజా కలం) ప్రతినిధి

రైల్వే విస్తరణ పనులతో దశాబ్దాలుగా నివాసముంటున్న పేద కుటుంబాలు గూడు కోల్పోయే పరిస్థితి ఏర్పడటంతో వారికి ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. అర్హులైన బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా కృషి చేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హామీ ఇచ్చారు. ఓల్డ్ ఎంఐజీ, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో సుమారు 40 ఏళ్లుగా నివాసముంటున్న పేద కుటుంబాలు రైల్వే విస్తరణ పనులతో గుడిసెలు కోల్పోతున్న సమస్యను పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు బాధిత కుటుంబాలతో కలిసి ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు నిరాశ్రయులవుతున్న పేదలకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని,ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు..





యాదగిరిగుట్టలో మూడు రోజుల పాటు కార్తీకోత్సవాలు

20 నుంచి 22 వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి, నవంబర్ 9 (ప్రజాకలం):

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు కార్తీకోత్సవాలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వెల్లడించారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భవానీ శంకర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు.

భక్తి.. ఆధ్యాత్మికత.. సాంస్కృతిక వైభవం

పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో తొలిసారిగా మూడు రోజుల పాటు కార్తీకోత్సవం–2026 పేరుతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ధార్మిక పండితుల ప్రవచనాలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, భక్తి సంగీత కచేరీలు, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయ వారసత్వంతో పాటు తెలంగాణ ప్రత్యేక కళారూపాలను ప్రోత్సహించడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

మూడు రోజుల కార్యక్రమాల వివరాలు

ఈ నెల 20న (శుక్రవారం): ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవస్థాన అర్చక బృందం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహ నామార్చన సహిత కోటి పుష్పార్చన నిర్వహించనున్నారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని దివ్యనామాలతో స్తుతిస్తూ కోటి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు తేలు విజయ బృందం జానపద భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించనుంది.

ఈ నెల 21న (శనివారం): సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పరంపర సంస్థ ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆర్.పి. పట్నాయక్, నిహాల్, నిత్యసంతోషిణి, గోపిక పూర్ణిమ, శ్రీనిధి, స్వప్న తదితర కళాకారులు, వాద్య బృందం ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఈ నెల 22న (ఆదివారం): సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు రుద్రాక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒడిస్సీ నృత్య ప్రదర్శన, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు అభినేత్రి బృందం ఆధ్వర్యంలో తెలంగాణ దేవాలయాల ఇతివృత్తంతో నృత్య ప్రదర్శన నిర్వహించనున్నారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు కళాకృష్ణ బృందం పేరిణి నృత్య ప్రదర్శనతో పాటు ఒడిస్సీ, తెలంగాణ దేవాలయాల ఇతివృత్తంతో రూపొందించిన ప్రత్యేక నృత్య ప్రదర్శనలు అలరించనున్నాయి.

భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం, భక్తిభావాన్ని పెంపొందించేలా ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పెండింగ్ రెవెన్యూ దరఖాస్తులపై కలెక్టర్ ఆగ్రహం

ఫిర్యాదులపై తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి

నిర్లక్ష్యం వహిస్తున్న తహసీల్దార్లపై అసహనం



యాదాద్రి భువనగిరి, నవంబర్ 9 (ప్రజాకలం):

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తూ, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడంపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత తహసీల్దార్లపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ సమక్షంలో రెవెన్యూ అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా, ప్రాజెక్టుల వారీగా భూసేకరణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భూసేకరణకు సంబంధించి పీఎన్, పీడీ అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, భూముల స్వాధీనం, సేకరించిన భూముల వివరాలను భూభారతి పోర్టల్‌లో నమోదు చేసిన అంశాలపై సమీక్షించారు. పెండింగ్ పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు.

పరిహారం చెల్లింపుల్లో జాప్యం వద్దు

ట్రిబుల్ ఆర్ పరిహారం చెల్లింపుల్లో లబ్ధిదారుల వారీగా ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బునాదిగాని కాలువకు సంబంధించిన పరిహారం చెల్లింపుల పురోగతిని గ్రామాల వారీగా సమీక్షించి, పెండింగ్ చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

గడువులోగా దరఖాస్తుల పరిష్కారం

భూభారతి పోర్టల్‌లో పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులు, రీ–సర్వే పురోగతి, ఎస్ఐఆర్/ఎంఎల్‌సీ పెండింగ్ క్లెయిమ్‌లు, జీవో 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై కలెక్టర్ సమీక్షించారు. ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి సర్కార్‌పై సమరశంఖం పూరించిన బిజెపి

హామీలు నెరవేర్చే వరకు పోరాటం తప్పదు

బీజేపీ సీనియర్ నేత కోలన్ శంకర్ రెడ్డి

మహేశ్వరం, నవంబర్ 09, (ప్రజా కలం)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ధ్వజమెత్తింది. అభివృద్ధి పనులు పూర్తి చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్న మాటలు కేవలం “ఉత్త ప్రగల్భాలు” మాత్రమేనని బీజేపీ సీనియర్ నేత కోలన్ శంకర్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పర్యటనల సమయంలో నిరసన తెలపకుండా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను గృహ నిర్బంధాలు చేయడం, ముందస్తు అరెస్టులు చేయడాన్ని బిజెపి తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారని మండిపడింది. నిరుద్యోగులకు ఇచ్చిన మాటకు కట్టుబడి నెలకు 4,000 భృతి తక్షణమే చెల్లించాలి. మహిళలకు నెలకు 2,500 మహాలక్ష్మి పథకం, కళ్యాణ



లక్ష్మితో పాటు తులం బంగారం అందజేయాలి.రైతు భరోసా మరియు సంపూర్ణ రైతు రుణమాఫీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లను పెంచిన హామీని నెరవేర్చాలి.ఈ నెల ఆఖరు నాటికి హామీలన్నీ నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత కోలన్ శంకర్ రెడ్డి హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తా

టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మహమ్మద్ అతహర్

భువనగిరికి చెందిన నాయకుడికి రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు

యాదాద్రి భువనగిరి నవంబర్ 9(ప్రజాకలం న్యూస్) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర అధికార ప్రతినిధిగా భువనగిరి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అతహర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆయనకు రాష్ట్ర





స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించింది. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, రాజకీయ అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించనున్న మహమ్మద్ అతహర్ పార్టీ విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను మీడియా వేదికగా ప్రజలకు వివరించనున్నారు.భువనగిరి పట్టణానికి చెందిన నాయకుడికి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి లభించడం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అతహర్‌కు పలువురు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

అల్వాస్‌గూడలో సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ఏఐసీసీ -విచార్ విభాగ్ కో

ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, నవంబర్ 09,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రజా నాయకుడు ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈరోజు అల్వాస్‌గూడలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం కేక్ కట్



చేసి, స్థానిక ప్రజలకు పండ్లు పంపిణీ చేస్తూ మా అన్న రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం జరిగింది.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మా అన్న రేవంత్ రెడ్డి గారికి భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరింత శక్తిని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తున్నాను.ఈ జన్మదిన వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు స్థానిక ప్రజలందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమం లో నాదర్గుల్ డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధనరెడ్డి ,సంతోష్ రెడ్డి, నవారు మల్లారెడ్డి దిండు శ్రీనివాస్ గౌడ్, వెంకటరెడ్డి, కుంచా నాగేందర్ గౌడ్,రామిడి నరసింహారెడ్డి, రాజు యాదవ్, శ్రీధర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, చంద్రా రెడ్డి, శ్యాం రావు, నరేంద్ర రావు, లింగం యాదవ్, అశోక్, రామిడి బుచ్చిరెడ్డి, జైపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, గోలి రంజిత్ రెడ్డి, ధన్సింగ్ నాయక్, చౌహన్ నాయక్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

ఇష్ట రాజ్యాంగ విద్యుత్ విద్యుత్ కోతలు

మెదక్ నవంబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి)

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ రేగోడు మండల ప్రజా పరిషత్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మర్పల్లి, పోచారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేగోడు సబ్ స్టేషన్ నుండి చౌదర్పల్లి, మర్పల్లి,పోచారం, ప్యారారం గ్రామాలకు ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ చిన్నచిన్న విద్యుత్ సమస్యలకు సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఈ నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని కొందరు ఆపరేటర్లు కొందరు ఎల్సర్లు వారి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తూ చిన్న చిన్న పనుల నిమిత్తం సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారన్నారు.ఈ విషయంపై గతంలో పనిచేసిన ఏ ఈ, ఏడి,డీ ఈ లకు కూడా ఫిర్యాదు చేసిన వారు స్పందించలేదని శనివారం రాత్రి దీపావళి సందర్భంగా లక్ష్మీ పూజలు ఉన్న సందర్భంలో సుమారు 20 నిమిషాలు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరిగిందన్నారు.సోమవారం ఉదయం కూడా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరిగిందని ప్రతి రోజు ఎదో ఒక సమస్యతో విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఉదయం వేళలో చదువుకునే విద్యార్థులు పాఠశాలలకు వెళుతుంటారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరం నిలిపివేస్తున్నారు. అధికారులు స్పందించి రైతులకు ఒక సమయాన్ని కేటాయించి రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న విద్యుత్ సిబ్బందిపై తగు చర్యలు తీసుకొని విద్యుత్ సరఫరాను సక్రమంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బాలయ్య, మాజీ ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ రాములు, మాజీ సర్పంచ్ వినోద భూమిరెడ్డి, వార్డు సభ్యులు రఘుపతి,గోపాల్, విజయ్, తుల్జారాం, బాలు, మల్లేశం, అప్రూచ్ తదితరులు ఉన్నారు.





ఆర్మూర్‌లో అంగరంగ వైభవంగా

బౌద్ధ జ్ఞాన దీపావళి వేడుకలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 9: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో బౌద్ధ జ్ఞాన దీపావళి వేడుకలు ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుండి బౌద్ధ ఉపాసకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, బుద్ధ విగ్రహం చుట్టూ ప్రమిదలతో దీపాలు వెలిగించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సిద్ధార్థుడు బోధి జ్ఞానాన్ని పొంది, ధర్మబోధ చేస్తూ తిరిగి కపిలవస్తు నగరానికి చేరుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను జరుపుకుంటారని నిర్వాహకులు తెలిపారు. నాడు కపిలవస్తు ప్రజలు బుద్ధునికి వరుస దీపాలతో స్వాగతం పలికిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏటా ఈ బౌద్ధ జ్ఞాన దీపావళిని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో చిన్నారులు భక్తిశ్రద్ధలతో త్రిశరణం, పంచశీల పద్యాలను ఆలపించారు. ఈ సందర్భంగా పలువురు బుద్ధిష్ట్ వక్తలు మాట్లాడుతూ.. ప్రపంచంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానం, కరుణ, సమానత్వం, శాంతి మార్గాలను బుద్ధుడు మానవాళికి అందించారని కొనియాడారు. బుద్ధుని ఉన్నతమైన ఆశయాలను, బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ వేడుకలను యశోబుద్ధ ఫౌండేషన్ – తెలంగాణ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా – ఆర్మూర్, మరియు అంబేద్కర్ యువజన సంఘం – నిజామాబాద్ ప్రతినిధులు సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఉపాసకులకు, ప్రజలకు నిర్వాహక కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కమ్మర్‌పల్లిలో పేకాట రాయుళ్ల అరెస్ట్

- ఆరుగురిపై కేసు నమోదు, నగదు స్వాధీనం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 09:

నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగంగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారం భించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కమ్మర్ పల్లి పరిధిలో కొంతమంది బహిరంగంగా డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నట్లు పోలీ సులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడిలో బహిరంగంగా జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, అదువులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి 9,500 నగదు, నాలుగు సెల్ ఫోన్లు మరియు పేకాట ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా కమ్మర్ పల్లి ఎస్ఐ సిఎచ్. సతీష్ మాట్లాడుతూ.. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే, ముఖ్యంగా పేకాట మరియు జూదం ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎవరైనా తమ పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన కోరారు.



హైద్రాబాద్ కు రావాలని కెకె కమిటి ముంబై ఉద్యమకారులకు ఆహ్వానం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 9:

కెకె కమిటి సభ్యులు, గౌరవనీయులైన ఎమ్మెల్సీ కోదండరామ్ సార్ ని ఆదివారం ముంబై ప్రతినిధులు ప్రత్యక్షంగా కలశారు. ముంబై భివండి నవీముంబై సూరత్ లో తెలంగాణ రాష్ట్ర సాధనకు క్రియాశీల పాత్ర పోషించిన విషయం అందరికి



తెలిసిందే. అందులో ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటిజెఏసీ) వహించిన పాత్ర గణనీయమైంది. అయితే ప్రభుత్వం ఏర్పరచిన కెకె కమిటి ద్వారా తమకు సమ న్యాయం జరగాలని, తమరితో భేటీకి సమయం ఇవ్వాలని కోదండరాం సార్ ను ఎంటిజెఏసి వైస్ చైర్మన్ కాసుల నర్సింహా గౌడ్ విజ్ఞప్తి చేయగా, పాజిటివ్ గా స్పందిస్తూ 13నవంబర్ కు మీ ప్రతినిధులందరు హైద్రాబాద్ రావాలని కోదండరాం సార్ ఆహ్వానించారు. ఈ శుభ వార్తకు ముంబై భివండి నవీముంబై సూరత్ ఉద్యమకారులు హైద్రాబాద్ కై సమాయత్తం అవుతున్నారు. ఈ విషయంలో సహకరించిన స్థానిక టీజేఏసీ శ్రీనివాస్ సార్ కు ముంబైకర్లు కృతజ్ఞతలు తెల్పారు.

ప్రజావాణిలో 15 ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 9:


ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి 15 ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సీఐలకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి భయం, పైరవీలు, మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించడం, శాంతిభద్రతలను పరిరక్షించడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు.



ఏర్గట్లలో ఎత్తిపోతల పథకం నిర్మించాలి

- కలెక్టర్‌కు ఉప సర్పంచ్ ఫోరం వినతి

- రెండు నెలల్లో బట్టాపూర్ విద్యుత్ సమస్యలు తీరుస్తాం: డీఈ హామీ



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 09:

ఏర్గట్ల మండలంలోని గోదావరి నదిపై ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి, రైతులకు సాగునీరు అందించాలని నిజామాబాద్ జిల్లా ఉప సర్పంచ్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మూడ్ దయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ.. మండలంలోని తడపాకల్, దొంచందా, గుమ్మిర్యాల్ గ్రామాల శివారులో ప్రవహిస్తున్న గోదావరి నది నుండి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలన్నారు. దీని ద్వారా మండల కేంద్రం ఏర్గట్లతో పాటు తాళ్లరాంపూర్, తడపాకల్, బట్టాపూర్, తోర్తి గ్రామాలకు సాగునీరు అందించి రైతులకు అండగా నిలవాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. అలాగే, గుమ్మిర్యాల్ గ్రామ శివారులోని నదిపై చెక్ డాం నిర్మించి నీటిని నిల్వ చేయాలని, ఆ నీటిని ఎత్తిపోతల ద్వారా గుమ్మిర్యాల్, నాగేంద్ర నగర్ సహా మండలంలోని అన్ని గ్రామాల చెరువులకు మళ్లించాలన్నారు. దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి, బోరుబావులు ఎప్పుడూ నిండుగా ఉంటాయని, రైతులు ఏడాది పొడవునా పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. మండలంలోని బట్టాపూర్ గ్రామంలో సుమారు 40 విద్యుత్ స్తంభాల అవసరం ఉందని దయానంద్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ శివారులోని మల్లన్న స్వామి ఆలయం నుండి శుక్రవారం దేవి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్, నీటి సౌకర్యం కోసం కొత్త మీటర్ మంజూరు చేయాలన్నారు. దీనికోసం స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు ఇప్పటికే డీడీ కట్టినట్లు తెలిపారు. మల్లన్న స్వామి ఆలయం నుండి దేవి ఆలయం వరకు కొత్త విద్యుత్ లైన్ మంజూరు చేయాలని కలెక్టర్‌తో పాటు సంబంధిత డీఈ (టెక్నికల్) వెంకటరమణను కోరగా.. రెండు నెలల లోపు విద్యుత్ స్తంభాలు, తీగలు వేసి సౌకర్యం కల్పిస్తామని అధికారి హామీ ఇచ్చినట్లు దయానంద్ పేర్కొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మండలంలో ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేడుకలు



బొమ్మలరామారం,
నవంబర్ 08 (ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, యావపూర్ గ్రామంలోని మడావత్ రాజు ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో ఆదివారం రోజున బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం నిర్వహించి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పట్టుబట్టలు,స్వీట్లు,టపాకాయలు అందజేసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.వారి నూతన గృహంలో అడుగుపెట్టి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొని వారి ఆనందాన్ని రెట్టింపు చేశారు

ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు..

తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో మండలంలోని రామస్వామి తండా, చీకటిమామిడి,యావపూర్ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు ఈ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి సంబరాలు జరుపు కున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులకు స్వయంగా కేక్ తినిపించి,మహిళలకు చీరలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ,ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులు, మహిళలు,యువతకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలనను అందిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో యావపూర్ తండా సర్పంచ్ మాడావత్ తార రాజు నాయక్,మండల అధ్యక్షులు చీర సత్యనారాయణ,పిఏసిఎస్ చైర్మన్ సింగర్తి మల్లేశం, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్ పైలట్, మండల తాహసిల్దార్ పి.రాధ,ఎంపీడీవో శ్యామల, హౌసింగ్ డిఇ శ్రీ రాములు, స్థానిక ఎస్సై బుగ్గ శ్రీశైలం, మండల హౌసింగ్ ఏఈ రోహిత్,గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న,మండల మహిళా అధ్యక్షురాలు యంజాల కళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పకీరు సంగీత, జిల్లా అధికార ప్రతినిధి కవిత, జిల్లా కార్యదర్శి సునీత నాయక్,రామిడి జంగారెడ్డి, భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రామిడి రామ్ రెడ్డి, ఉపసర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మైలారం సుదర్శన్, యావపూర్ తండా గ్రామపంచాయతీ పాలకవర్గం స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలి

బొక్క జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన 30 మంది యువకులు



బీబీనగర్,నవంబర్ 09 (ప్రజాకలం): ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీబీనగర్ మాజీ మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని అన్నంపట్ల గ్రామంలో భాజపా, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 30 మందికి పైగా యువకులు ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో చాలా వరకు నెరవేరలేదని, ప్రభుత్వ తీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.భువనగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.యువత మత్తు పదార్థాలు, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామ యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్, బీబీనగర్ గ్రామ మాజీ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, పార్టీ మాజీ అధ్యక్షులు పిట్టల అశోక్, పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్వి జిల్లా ప్రధాన జక్కి నగేష్, ఉపాధ్యక్షులు కొంతం భాస్కర్ గౌడ్, బీబీనగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు కసగొని ఆంజనేయులు గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ పర్వతం కృష్ణ,పార్టీలో చేరిన వారు గ్రామ,నాయకులు,పెద్దలు,వార్డు సభ్యులు,యువకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో వరి పంట కోత ప్రయోగం

: ఎకరానికి 28 క్వింటాళ్ల దిగుబడి అంచనా

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 9:

వేల్పూర్ మండలంలోని కుక్కునూరు గ్రామంలో సోమవారం వరి పంట కోత ప్రయోగం (క్రాప్ కటింగ్ ఎక్స్పరిమెంట్) నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు గోజురు మహేష్, ఏర్దండి రాజేందర్ పొలాల్లో వ్యవసాయ శాఖ



అధికారులు ఈ దిగుబడి అంచనా కార్యక్రమాన్ని చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బి. రాజు పాల్గొని ఈ ప్రయోగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ రాజు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పంట దిగుబడిని అంచనా వేసేందుకు ఈ ప్రయోగాలు దోహదపడతాయని తెలిపారు. ఇందులో భాగంగా రైతుల పొలంలో పావు గుంట విస్తీర్ణంలో వరి పంటను కోసి, నూర్పుడి చేసి తూకం వేశారు. ఈ పావు గుంట విస్తీర్ణంలో 17.550 కిలోల వరి ధాన్యం దిగుబడి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దీని ఆధారంగా ఎకరానికి సన్నారకం వరి సుమారు 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ పంట కోత ప్రయోగాల ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా గ్రామ సరాసరి దిగుబడితో పాటు మండల, జిల్లా, మరియు రాష్ట్ర స్థాయి సరాసరి పంట దిగుబడులను అంచనా వేయడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ గణాంకాలకు, పంట బీమా నిబంధనలకు ఈ వివరాలు ఎంతో కీలకంగా మారుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శివప్రసాద్, సుస్థిర వ్యవసాయ కేంద్రం సీఆర్‌పీ చింత శ్రీనివాస్, భార్గవ్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అమృత్ పథకం పనులు వేగవంతం చేయాలి

: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 9:

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో



వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అమృత్ పథకం పనుల పురోగతిని సమీక్షించారు. అమృత్ పథకం కింద వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

13వ వార్డులో పదేళ్లుగా అభివృద్ధి కరువు.. కాలనీవాసుల అవస్థలు

రోడ్లు, డ్రైనేజీ లేక ప్రజలకు ఇబ్బందులు - మహమ్మద్ రజాక్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)నవంబర్ 9:



ఆర్మూర్ పట్టణ మున్సిపల్ పరిధిలోని 1300 ప్లాట్ల ప్రాంతం 13వ వార్డులో గత పదేళ్లుగా అభివృద్ధి పనులు జరగడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రజాక్ ఆరోపించారు. సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దోమల బెడదతో డెంగ్యూ, మలేరియా వ్యాధుల భయంతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇచ్చి, ఆ తర్వాత కాలనీ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి కాలనీని సందర్శించి రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇది ప్రజాపాలనా? రాజరికపు పాలనా? అని ప్రశ్నించారు. ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే పాలన అందించాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రజాక్ కోరారు.



నెంబర్ ప్లేట్ లేని వాహనాల

పట్టించుకునేది ఎవరు

-తనిఖీల పేరా కెమెరాలకి పరిమితమైన పోలీసులు

-ఈ చాలానుల పేరా సామాన్యుడుపై జరిమానా



మెదక్ నవంబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి)

పావన్నపేట్,కౌడిపల్లి,కొల్చారం, అల్లాదుర్గం పోలీస్ సర్కిల్ పరిధిలోని టేక్మాల్, అల్లాదుర్గం పెద్ద శంకరంపేట్, రేగోడు,ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలకు నెంబర్లు తీసి రోడ్లపై తిరుగుతే పోలీసులు మాత్రం వట్టించుకోవడం లేదు. నెంబర్ లేని వాహనదారుడు రోడ్డుపై వెళ్లినప్పుడు ప్రమాదం సంభవిస్తే ఈ వాహనదారుడు ఎవరు అని గుర్తించలేని పరిస్థితి కనపడుతుంది. పెద్ద శంకరంపేట్, అల్లాదుర్గం, టేక్మాల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అత్యధికంగా నెంబర్ లేని వాహనాలు కనపడ తాయి, కానీ పోలీసులు మాత్రం వాహనాల తనిఖీలు ధ్రువపత్రాలు మాత్రం పరిశీలించడం లేదు.కొందరు వాహనదారులు పోలీసు అధికారుల సహకారంతోనే నెంబర్ తమ వాహనాలకు రాయించుకోకుండా రోడ్లపై తిరుగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. సామాన్యులు వాహన పత్రాలు హెల్మెట్ లేదా చిన్నపాటి నిబంధన ఉల్లంఘిస్తే చాలు పోలీసులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా వాహనాలు ఆపి సెక్షన్ల కింద ఈ ఈ ఛాలనాలు భారీగా జరిమానాలు విదిస్తున్నారు. కానీ నిబంధనలకు విరుద్దంగా నెంబర్ ప్లేట్ లేకుండా ప్రత్యేక రంగు బోర్డులతో తిరుగుతున్న వాహన లు పోలీసులకు కనబడటం లేదా అని ప్రశ్నలు ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.గతంలో పోలీస్ వారి తనిఖీల్లో ధ్రువపత్రాలు పరిశీలిస్తే దొంగ వాహనమా లేదా వాహనదారుడి వాహనమా కనపడతాది కావున జిల్లా ఎస్పీ స్పందించి నెంబర్ లేని వాహనాలు కనపడితే అట్టి వాహనదారుడిపై చర్యలు తీసుకునే విధంగా చూడవలసిన బాధ్యత పోలీసులపై ఉందని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం: మైనంపల్లి హనుమంతరావు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



మల్కాజిగిరి, నవంబరు 9 (ప్రజా కలం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీతోనే సమాజంలోని అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందడంతో పాటు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు.

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయినగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వ హించారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షల కు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.


రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, మురుగేష్, మీనా ఉ పేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, జీడి సంపత్, ప్రవీణ్, పిట్ల శ్రీనివాస్, శ్రీరామ్ యాదవ్, జి ఎన్ వి సతీష్ కుమార్, సత్యనారాయణ, బాబు,సంతోష్ రాందాస్, సయ్యద్ మబ్బు,పార్థసారథి, ఇస్తారి, అరవరాజు, , తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఉల్లంఘన ఆరోపణలపై

కాంగ్రెస్ నేత చెన్నారెడ్డి సస్పెన్షన్

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సహించేది లేదు: బి.కె. శ్రీనివాస్



మల్కాజిగిరి, నవంబరు 9 (ప్రజా కలం ప్రతినిధి): పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడం, సీనియర్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం, పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు కె. చెన్నారెడ్డిపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు సోమవారం మల్కాజిగిరి అసెంబ్లీ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు బి-బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కె. శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం, పార్టీ విధివిధానాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం వంటి అంశాలు పార్టీ దృష్టికి వచ్చాయని తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్ నాయకుడిగా పరిచయం చేసుకుంటూ వివిధ సంక్షేమ పథకాల పేరుతో ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసి, వివరణ కోరిన అనంతరం చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు పార్టీ క్రమశిక్షణను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బి.కె. శ్రీనివాస్ తెలిపారు. పార్టీకి నష్టం కలిగించే కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత వ్యవహారాలు, సామాజిక మాధ్యమాల వేదికలు, పార్టీ గ్రూపుల్లోనూ క్రమశిక్షణ పాటించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, సోమవారం మాజీ కార్పొరేటర్ నివాసం వద్ద ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో మైనంపల్లి హనుమంతరావు పార్టీ వ్యవహారాలపై చర్చించినట్లు తెలిసింది. పార్టీకి నష్టం కలిగించే వ్యక్తులకు పార్టీలో స్థానం ఉండకూడదని, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం.

పంచాయతీ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు డిమాండ్

ఎర్రవల్లిలో కార్మికులతో సహపంక్తి భోజనం..

దీపావళి మిఠాయిల పంపిణీ

గజ్వేల్ నియోజకవర్గం, 09 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

గ్రామాల పరిశుభ్రత, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి



కప్పర ప్రసాదరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ,పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.బీఎంఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి మరాఠీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవల్లిలో కార్మికుడు నరసయ్య నివాసంలో సోమవారం కార్మికులతో కలిసి కప్పర ప్రసాదరావు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కార్మికులకు దీపావళి మిఠాయిలు పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు కేవలం రూ.9 వేల వేతనంతో కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు,పిల్లల చదువుల బాధ్యతలు నిర్వహించడం కార్మికులకు భారంగా మారుతోందన్నారు.కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు,ఆర్థిక భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎంఎస్ మండల అధ్యక్షుడు ఆవుల కాడి లక్ష్మయ్య,బీజేపీ నాయకులు కుంట సత్యం, సామ్యూల్,కార్మికులు భూమయ్య,చంద్రయ్య,నరసయ్య, పెంటయ్య, చిన్నారి,లలిత,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో బత్తుల కృష్ణ

సామాజిక న్యాయం, బీసీల హక్కుల సాధనే ప్రధాన లక్ష్యం



హైదరాబాద్, నవంబరు 9 (ప్రజా కలం ప్రతినిధి): నల్గొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి హైకోర్టు న్యాయవాది బత్తుల కృష్ణ పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక న్యాయం కోసం పోరాడు తున్న తాను, ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, యువజన కాంగ్రెస్ నాయకుడిగా పనిచేసిన అనుభవం తనకు ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్‌గా ముందుండి పోరాటం చేశానని వివరించారు.ప్రస్తుతం న్యాయవాదిగా విద్యా, న్యాయ, సామాజిక రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బీసీ లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, బీసీ కులాల ఐక్య వేదికలో క్రియాశీలకంగా పనిచేస్తూ బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతున్నానని చెప్పారు. సుప్రీంకోర్టు బార్‌కు సంబంధించిన కార్యకలాపాల్లోనూ సభ్యుడిగా భాగస్వామ్యం అవుతున్నానని పేర్కొన్నారు. న్యాయశాస్త్రంలో పట్టా, ఎం.పి. చదువుతో పాటు సామాజిక సేవలో మాస్టర్స్ డిగ్రీని అభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీల్లో జెండాలు మోస్తూ పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు, న్యా యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యార్హతలు ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాలు లేక, రాజకీయాల్లో కొనసా గలేక ఇబ్బందులు పడుతున్న వారికి మార్గదర్శిగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే ఇలాంటి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ పరంగా, న్యాయపరంగా వారికి తగిన న్యాయం జరిగేలా పోరాడతానని అన్నారు. ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన పట్టభ ద్రులు, మేధావులు, మహిళలు, న్యాయ వాదులు, ఉపాధ్యాయులు తనకు మద్దతుగా నిలిచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని బత్తుల కృష్ణ విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల సమస్యలు, బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం శాసనమండలిలో తన గళాన్ని వినిపిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో 50 మంది మాజీ సైనికుల చేరిక

మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్న సభ్యులు

మల్కాజిగిరి, నవంబరు 9 (ప్రజా కలం ప్రతినిధి): నేరేడ్మెట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. అగ్నికుల క్షత్రియ మాజీ సైనికుల సంక్షేమ సంఘానికి చెందిన దాదాపు 50 మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో, నేరేడ్మెట్ మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్.ఆర్. ప్రసాద్ ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు చురుకుగా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బెలాల రామారావు, ఏ. తాతారావు, టి. మోహన్ వర్మ, ఏ. ఈశ్వర్ రావు, పి. గోపాల్ పట్రావు, జి. రామమూర్తి, బి. పద్మనాభం, ఎం. హేమచందర్ రావు, కె. జోగారావు, ఏ. కాంతారావు, జి. నరసింహులు, డివిజన్ అధ్యక్షుడు రాఘవన్, మధుసూదన్ రెడ్డి, తరుణ్, మల్లేష్, శ్యామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న కలెక్టర్ హైమావతి

రైతులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ ముఖాముఖి

గజ్వేల్ నియోజకవర్గం, 09 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం, రైతుల అభివృద్ధే దేశాభివృద్ధి అనే సందేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట నుంచి రైతులతో వర్చువల్‌గా మాట్లాడారు.రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు పలు అంశాలపై సందేశం అందించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండలం మేదినీపూర్ గ్రామ రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ కె.హైమావతి వర్చువల్‌గా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, మార్కెటింగ్,పశుసంవర్ధక,మత్స్య శాఖల అధికారులు,ఏఎంసీ చైర్మన్ వీరుపాక శ్రీనివాస్,స్థానిక సర్పంచ్, వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు పాల్గొన్నారు.



పాములపర్తిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

-మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా

గజ్వేల్ నియోజకవర్గం, 09 నవంబర్ (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మార్కుక్ మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్,బీసీ సెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్,సర్పంచ్ భవాని బాలకిషన్,ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్, వార్డు సభ్యులు కర్ణాకర్,శ్రీనివాస్, చక్కలి రాములు,బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



ధనలక్ష్మి పూజలో పాల్గొన్న గజ్వేల్ సీఐ రవికుమార్

యువత వ్యాపార రంగంలో రాణించి మరికొందరికి ఉపాధి కల్పించాలి

గజ్వేల్, 09 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర హొసరీ యూత్ ఫ్యాషన్ షాప్‌లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ధనలక్ష్మి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ సీఐ రవికుమార్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ నందర్భంగా షాప్ యజమాని బాలరాజ్ గౌడ్‌ను అభినందించారు.అనంతరం సీఐ రవికుమార్ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా వ్యాపార రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలని నూచించారు.స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగడంతోపాటు,మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బాలరాజ్ గౌడ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com